గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# డిసెంబర్ 2015
# కథలు




అబ్బా.. ఇంకెంత దూరం..

ఇలా అనుకోవడం ఇప్పటికి ఇరవై సార్లు.

చుట్టూ కొండలు, పచ్చని ప్రకృతి మధ్యలో మెలికలు తిరిగిన తారు రోడ్డుపై బస్సు వెళుతోంది. కిటికీ నుంచి చెట్లు చేమలు కొండలు గుట్టలు అలా కదలిపోతున్నాయి. అయినా కదులుతోంది బస్సే కదా.. వాటె సిల్లీ డౌట్. చిన్నగా నవ్వుకున్నాను. ఎన్నో ఏళ్ళ తరువాత అమృతను చూడబోతున్నాను. ఈ భావనే చాలా అద్భుతం అనిపిస్తోంది. తనను చూసి దాదాపు అయిదేళ్ళు దాటుతోంది. రెండు నెలల కిందట డిగ్రీ స్నేహితులందరూ అపురూపంగా అలమ్నయ్(పూర్వం విద్యార్థుల సమావేశం) చేసుకున్నాం. ఉద్యోగరీత్యా ఢిల్లీలో వున్నా కేవలం ఈ కార్యక్రమం కోసమే నాలుగు రోజులు సెలవు పెట్టుకుని మరీ వచ్చాను. దాదాపు అందరూ కలుసుకున్నాము. అమృత తప్ప. కార్యక్రమం జరుగుతున్నంత సేపూ తన గురించి ఎంక్వయిరీ చేస్తూనే వున్నాను. బిజీగా వున్నందున రాలేకపోయిందని వెంకట్ చివర్లో చల్లగా చెప్పాడు.

"ఆహా ఇక్కడ మనకేమో పనిపాట లేదాయే.. "నా గొంతులో కోపం, వెటకారం కలగలసి ధ్వనించాయి.

" అది కాదురా మాధవ్ రెండ్రోజుల ముందే అమృత ఇన్ ఫార్మ్ చేసింది. నువ్వు డిసప్పాయింట్ అవుతావేమోనని మేమే చెప్పలేదు. " వెంకట్ సంజాయిషీ ఇచ్చుకున్నాడు.

" అది కాదురా నెల నుంచే ప్లాన్ చేసుకున్నామా. వస్తుందని అనుకున్నా, సర్లే ఏం చేద్దాం " నాకు నేనే సర్దిచెప్పుకున్నాను. అమృత అడ్రస్ అడగాలనిపించినా ఎందుకో అడగలేక పోయా, రెండు రోజుల కిందట వున్నట్టుండి అమృత నుంచి ఉత్తరం .

ఎందుకు రాలేకపోయానో క్లుప్తంగా వివరిస్తూ మన వాళ్ళని చాలా మిస్ చేసుకున్నా ఓ రకంగా దురదృష్టవంతురాలిని సారీ అంటూ రాసింది. నీలి రంగు కాగితంపై ముత్యాల్లాంటి అక్షరాలు చూడగానే గత స్మృతులు తరంగంలా గుండెను మెత్తగా తాకాయి. లెటర్ వెనుక ఫ్రం అడ్రస్ చూసాక మనసు నిలవలేదు. ఎలాగైనా సరే అమృతను చూడాలని నిర్ణయించుకున్నాను. తనకు చెప్పకుండా వెళ్ళి సర్ ప్రైజ్ చేయాలన్న కుతూహలం కూడా తోడయ్యింది. ఫలితం .. ఇదిగో ఈ ప్రయాణం. బస్సు కుదుపుతో ఆగింది. నా ఆలోచనలకూ బ్రేక్ పడింది. బ్యాగు సర్దుకుని కిందకు దిగాను. మారుమూల పల్లెలో వుంటోందని తెలిసింది కానీ మరీ ఇలా అడవి మధ్యలో వుంటుందనుకోలేదు. ఎవరినైనా అడిగితే తప్ప ఊరు చేరుకోవడం కష్టమే. ఇంతలో ఓ మనిషి నా వైపే వస్తున్నాడు. మాసిన గడ్డం, భుజం పై తువాలు, నన్ను ఎగాదిగా చూసి " మాధవ సారూ అంటే మీరేనా " అడిగాడు. ఆశ్చర్యం వేసింది. ఇంత అడవిలో నా కోసం ఓ దూత.

" నా పేరు నర్సిమ్మ. మిమ్మల్ని తోడ్కొని రమ్మని అమృతమ్మ పంపింది సార్. తెల్లారు నుంచి ఈడనే వున్నా పదండి " నా బ్యాగు అందుకున్నాడు. వద్దని వారించినా వినేలా లేదు.

నేను వస్తున్నట్టు అమృతకు ఎలా తెలిసింది? ఎవరు చెప్పి వుంటారు? ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. హూ. సర్ ప్రైజ్ ఇద్దామనుకుంటే తను ఏకంగా షాకే ఇచ్చిందే అనుకుంటూ అతన్ని అనుసరించా.

************

" వేచి వున్నందుకు ధన్యవాదాలు..! "

చిర పరిచిత గొంతు. పుస్తకం లో మునిగి పోయిన నేను చటుక్కున తలెత్తా.

అమృత .. నవ్వుతూ వచ్చి కూర్చుంది. తనను చూడగానే ఒక్కసారిగా ఉద్వేగం గుండెల్లోంచి గొంతులోకి వచ్చినట్టయింది. బహుశ నా జీవితం లో ఎగ్జయిటెడ్ క్షణాల జాబితాలో ఇది ముందు వుంటుందేమో. కాటన్ చీరలో పొందికగా కనిపిస్తోంది. తను ఏం మారలేదు. కళ్ళజోడు వెనుక కళ్ళల్లో ఆ మెరుపు, ఆ చిలిపి నవ్వు, కోటేరు లాంటి ముక్కు, నవ్వినప్పుడు బుగ్గలపై సొట్టలు... కాకపోతే ముక్కు పుడక కొత్తగా కనిపిస్తోంది. " ప్రయాణం బాగా సాగిందా" ఆప్యాయంగా అడిగింది.

" మామూలుగా కాదులే , ఒళ్ళంతా హూనం. "

అందుకే నిన్ను డిస్టబ్ చేయకూడదని బయటికెళ్ళా. బాగానే నిద్ర పోయినట్టున్నావుగా.

"అంత లేదు. సగం మెలుకువ గానే వుంది. జస్ట్ రెస్ట్ అంతే." " మరి గురక పెట్టావని నర్సిమ్మ అన్నాడే. " నవ్వును పెదాలతో బిగపట్టింది. " అవునా నిజంగానా, " ఆశ్చర్యంగా అడిగా.

" అర్రే .... మరీ అంతలా ఆశ్చర్యపోకు జస్ట్ అలా అన్నా అంతే. మాధవ్ సారీ! రిసీవ్ చేసుకోలేకపోయాను. అర్జెంట్ మీటింగ్ వుంటే వెళ్ళాల్సి వచ్చింది. ఇట్స్ ఓకే. అవునూ ఊరికి దూరంగా ఇల్లేంటి?" " ఊరికే " మళ్ళీ నవ్వు..

" సాధ్యమైనంత వరకు అన్ని కాలుష్యాలకు దూరంగా వుండాలని " అమృత బదులిచ్చింది.

" ఎలా వున్నావ్? " నా గొంతులో ఆతృత.

అమృత చిన్నగా నవ్వేసింది

చొరవగా నా చేతిలో పుస్తకం తీసుకుని చూసింది. పెదాలపై చిన్న నవ్వు మెరిసి మాయమయ్యింది.

" ఓహో చలం మైదానమా. బాగుంది, ఇన్ని పుస్తకాలున్నా మళ్ళీ ఇదేనా మంచి పుస్తకం ఎన్ని సార్లయితే ఏముంది" అనాలనుకున్నా అంతలోనే తనే అందుకుంది. "అవును అయిదేళ్ళ నుంచి ఈ ఒక్క పుస్తకమే చదువుతున్నావా? లేదా చదవడం మానేసావా. " మాట పూర్తి కాకముందే గలగలా నవ్వు. తనేం మారలేదనడానికి ఇంకేం రుజువులు అక్కర్లేదనిపించింది. చొరవ నవ్వులో స్వచ్చత తను మాత్రమే అందంగా పలికే అరే .. ఓహో అలాగా! అనే ఊత పదాలు అన్నీ సేం టూ సేం. కాకపోతే రంగు మాత్రం కాసింత తగ్గినట్టుంది.

" నీ లైబ్రరీ వండర్ ఫుల్ ఇన్ని పుస్తకాలే.. !"

" థాంక్స్! కాని అన్నీ చదివేసానని అనుకోకేం, ఈ ప్రయాణం ముగిసేలోగా చదివేయాలని మాత్రం వుంది."

"మనం ఆశా జీవులం కదా! " అంది అమృత తమాషాగా భుజాలెగరేస్తూ " అవును ఇల్లు ఎలా వుంది? తోట చూసావా పద పద " నెక్స్ట్..

ఇద్దరం బయటకి వచ్చాం. చుట్టూ కొండలు, మధ్యాహ్నం ఎర్రగా ఎండ కాస్తున్నా చెట్లు ఉండడంతో వేడి తెలియడం లేదు. కాంపౌండ్ ఆనుకుని వరుసగా కొబ్బరి చెట్లు సరిహద్దు కాపలా కాస్తున్న సైనికుల్లా వున్నాయి.

గులాబి, చామంతి, మందారం, పారిజాతం, నిద్ర గన్నేరు... రకరకాల పూల తీగలు చెట్లు కంటికింపుగా కనిపిస్తున్నాయి. మరో పక్క పచ్చగా పరుచుకున్న ఆకు కూరలు, అక్కడక్కడ గుమ్మడి తీగలు, మధ్యలో నడవడానికి వీలుగా దారి.

పచ్చని తోట మధ్య ఇళ్ళు ఆశ్రమం లా వుంది. అమృత తోట ఎలా పెంచిందో వివరిస్తుంటే బుద్ధిగా వెనకాలే నడుస్తున్నా. " అవును నేనేం బోరు కొట్టించడం లేదు కదా." వున్నట్టుండి అమృత వెను తిరిగింది. " అబ్బే భలే దానివే ఇట్స్ ఇంట్రస్టింగ్ " తడబడుతూ బదులిచ్చా.

గంట తరువాత..

" మాధవ్ ఏమాత్రం సిగ్గు లేకుండా, సారీ సిగ్గు పడకుండా తినేయ్." ముసి ముసిగా నవ్వుతూ అంది. "అమ్మూ... స్టాప్ రోటీన్ జోక్స్. .." వెంటనే నాలుక కరుచుకున్నా. అమ్మూ అనేసా.. ఏమనుకుంటుందో.. అప్పట్లో నేనొక్కడ్నే.. అమృతను అమ్ము అని పిలిచేవాణ్ణి. ఆ ఆరాధనకు అదో ట్యాగ్ గా భావించే వాణ్ణి . విచిత్రం ఏమిటంటే.. ఎవర్నీ ఏ విషయం లోనూ ఎంటర్ టైన్ చేయని అమృత నేను అలా పిలిచినా కాదనక పోవడం. అది ఇప్పటికీ వండరే.

కాని అమృత ఇదేం గమనించినట్టు లేదు.

" సరే సరే ఇక మాటల్లేవ్ ..ఓన్లీ యాక్షన్. సరేనా లాగించు మరి." వంటకాలు చూడగానే ఆకలి ఆవురావురంది. గుమ్మడి కాయ సాంబార్, చింత పచ్చడి, ఆవకాయ, ఆలూ వేపుడు, అప్పడాలు, వడియాలూ వేడి వేడి అన్నం పచ్చని అరటి ఆకులో ఆహ్వానిస్తున్నాయి. అన్నీ నాకూ ఇష్టమైనవే. అసలు ఈ మెనూ చూస్తుంటే చాలా ప్లాన్ డ్ గా చేసినట్టుంది. ఆ క్షణం లో నా డైటింగ్ కెలోరీ లెక్కలు ఏవీ గుర్తుకు రాలేదు. అమృత కొసరి కొసరి వడ్డిస్తుంటే చాలా కాలం తర్వాత తృప్తిగా భోంచేసాను.

" అడగడమే మరిచా.. మరి నువ్వు..."

" ఆహా సారు గారికి ఇప్పుడు గుర్తొచ్చామా.. " నవ్వేసింది. " ఓకేసారి చెప్పను గానీ నేనే సర్వ్ చేస్తా. " " వద్దులే బాబూ, తమరు అలా వసారాలో తీరిగ్గా కూర్చుంటే పది నిముషాల్లో వస్తా." " అవునులే అమ్మాయిలు తాము తింటున్నప్పుడు ఎవరూ చూడకూడదనుకుంటారట. " ఆటపట్టించాను. " ఎక్స్ క్యూజ్ మీ తమరు అలా దయచేస్తారా.." అమృత గట్టిగా అనేసరికి నవ్వుతూ బయటికి నడిచా

*******

రాత్రి 8.00 గంటలు

ఆకాశం అద్భుతంగా వుంది. పిండారబోసినట్లు తళ తళ మెరుస్తూ వెన్నెల గాలికి కదిలే ఆకులపై వెండి కిరణాలు తళుకుక్కుమంటున్నాయి. పువ్వుల పరిమళాలు మోసుకొస్తున్నాయి. గాలులు శరీరాన్ని అలా నిమురుతుంటే ఏదో తెలియని పారవశ్యం మామిడి చెట్టు కింద చిన్న చప్టా పై ప్రశాంతంగా కూర్చున్నా. నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. ఇంట్లోంచి ఘంటసాల పాట మనసున మనసై.. గాలి అలలపై తేలాడుతూ చిన్నగా మనసును తాకుతోంది. డాక్టర్ చక్రవర్తి లోని పాట. డిగ్రీ రోజుల్లో ఈ పాటను

ఎన్ని సార్లు పాడుకున్నానో. ఫ్రెండ్స్ కలిస్తే చాలు. ఈ పాట పాడమని పట్టుబట్టేవారు. ఆ రోజుల్లో నేనో చిన్న సైజు ఎస్. పీ. ని కానీ గ్రూపులో ఆ పాటే నన్ను ప్రత్యేకం గా నిలబెట్టింది. చుట్టూ తోట మధ్యలో ఇల్లు చూస్తుంటే వెన్నలంతా మేసి ఏరు నెమరేస్తోంది ఏటి కడుపున దాగి తోట నిదురోతోంది అన్న నండూరి వ్యాక్యాలు గుర్తొస్తున్నాయి. అదృష్టమంటే అమృతదే! ప్రతిరోజూ ఇలా ప్రకృతిని మనసారా ఆస్వాదించే ఛాన్స్ ఎందరికి వస్తుంది? ఢిల్లీ జనారణ్యం లో ఇరుకిరుకుగా బతికేస్తున్న నాకు ఈ వాతావరణం ఓ అపురూప దృశ్య కావ్యంలా కనిపిస్తోంది. అమృతను చూడాలన్న నా ఆలోచనకు నేనే థాంక్స్ చెప్పుకున్నా. ఒకవేళ ఆ ఆలోచనే రాకుంటే ఇంత చక్కటి ప్రాంతం చూసేవాణ్ణి కాదేమో. ఇంతలో అమృత వచ్చి కూర్చుంది. ఉడికించిన పల్లీల ప్లేటు ముందుంచింది. కొన్ని క్షణాలు గడిచాయి.

"మాధవ్ ఇప్పుడు చెప్పు ఎలా వున్నావ్?"

"అది అడగాల్సింది నేను. ఉదయం నా ప్రశ్నకు బదులివ్వనేలేదు. మీ వారెక్కడ?"

" వాతావరణం చాలా హాయిగా వుంది. మనసుకు ఇష్టమైన మాటలైతే బెటర్ అనుకుంటా " అమృత మాటల్లో ఏదో మార్మికత. అయిదేళ్ళ తర్వాత కలుసుకున్నాం.. " ఎలా వున్నామో తెలుసుకోనక్కర్లేదా? " నిష్ఠూరంగా అడిగాను. " ఏముంది డిగ్రీ అయ్యాక నా పెళ్ళి . అంతా హడావిడిగా అయిపోయింది. ఆ మరుసటేడే ఆయన దుబాయ్ వెళ్ళిపోయారు. అక్కడ సంపాదన బాగా వుంటుందటగా" ట కారాన్ని వత్తి పలికింది.

"మరి నువ్వు"

" మాధవ్ అందరి ఆలోచనలు ఒకేలా వుండవు కదా. తనకు డబ్బంటే ఇష్టం.. నాకు ఇలాంటి బతుకంటే ఇష్టం. పొంతన కుదరనప్పుడు ఎవరికేది ఇష్టమో అది చేయడమే మంచిది. " నెమ్మదిగా అంది.

"ఆయన ఇండియా వస్తుంటారా."

".. నా కాపురం ఎలా వుంది? ఎంత మంది పిల్లలు? ఏం చేస్తున్నారు? ఇవేగా నువ్వడగాలనుకున్న ప్రశ్నలు. పెళ్ళయిన ఏడాదికి ఆయన , నేను చెరోదారి అయ్యాం. డైవోర్స్ కాలేదు గానీ.. ఎవరి బతుకు వారిదే. తను దుబాయిలో, నేను ఇక్కడ. బీయెడ్ చేశాక ఈ ఊళ్ళో టీచర్ గా చేరాను. ఇక్కడ పేదల బతుకులు, అందులోనూ చిన్నారుల జీవితాలు చూసాక నా శక్తి మేరకు ఏదైనా చేస్తే

బాగుంటుందనిపించింది. వాత్సల్య పేరిట సేవా సంస్థ ప్రారంభించా. మన క్లాస్ మేట్ రమేష్ యూ.ఎస్ లో వున్నాడు. నీకు తెలుసుగా తను అక్కడి ఎన్నారైలతో నా ప్రోగ్రాం లను స్పాన్సర్ చేయిస్తున్నాడు. టీచర్ గా వున్నప్పుడు ఈ పల్లెను చాలా దగ్గరగా పరిశీలించాను. పల్లెల్లో పిల్లల ఎదుగుదల, చదువు ఎంత కష్టమో తెలిసింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న మిడ్డే మీల్, ఇతర సంక్షేమ కార్యక్రమాలు ఫలితం అంతంత మాత్రమే. పథకాలు మంచివే. డెలివరీ లో ఎన్నో లోపాలు. అదేదో అంటారే.. ఇచ్చే చేతులు పుచ్చుకునే చేతుల మధ్య మరిన్ని చేతులో అని , అలా వుంటుంది వ్యవహారం.

ఈ పిల్లలే నా ఉపాధి మార్గం అవుతున్నప్పుడు వారి కోసం ఏదైనా చేయాలనిపించింది. అప్పట్లో నా వంటరితనం కూడా కారణం కావచ్చు. కొన్నాళ్ళు ఉద్యోగం చేస్తూ ఆర్గనైజేషన్ నిర్వహించాను. కానీ రెండు పడవలపై ప్రయాణం కష్టమనిపించింది. అందుకే పూర్తిగా దీనికే అంకితమయ్యా, నాలుగు రాళ్ళు వెనకేసుకోవాలనే తాపత్రయం లేదు కాబట్టి స్వచ్ఛందంగానే నడిపిస్తున్నా. దేశం , సమాజం ఉద్ధరిస్తున్నానన్న భారీ డైలాగులు కొట్టలేనుగానీ, చేతనైన సాయం చేస్తానన్న తృప్తి మాత్రం వుంది. అన్నిటికీ మించి ఊరి వాళ్ళు నన్ను నమ్మారు. ఇదిగో ఈ ఆశ్రమం పిల్లలూ ఇవే నా ప్రపంచం. అమృత మాటల్లో తన ఆలోచనల్లో సీనియారిటీ సీరియస్ నెస్ బాగా నచ్చింది. మునుపటికన్నా తనపై అభిమానం పెరుగుతున్న ఫీలింగ్. అంతేకాదు, నేను వస్తున్నట్టు అమృతకు ఎలా తెలిసిందో కూడా అర్థమయింది. రమేష్ తో ఎఫ్.బి లో చాట్ చేస్తూ చెప్పాను. బహుశా తను ఇన్ ఫార్మ్ చేసి వుంటాడేమో.

అమృత మాటలు కొనసాగిస్తూ..

"...ఇక నా వైవాహిక జీవితమంటావా.. ఏడడుగులు పెళ్ళిలో నడిచామే గానీ ఆ తరువాత అడుగులు కలవలేకపోయాయి. తప్పెవరిదని వాదించడం కన్నా ఎవరంతట వారుండడమే మేలనుకున్నాం. తనూ పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. ఇది నా ఫ్లాష్ బాక్ "అమృత ఆగింది. కాసేపు నిశ్శబ్దం.

మరీ ఈ విషయం కనీసం నాకు తెలపాలనిపించలేదా. క్షణం నా వైపు చూసి మెల్లగా నవ్వేసింది.

" ఏంటి మాధవ్ చెబితే ఏమవుతుంది. ప్రాబ్లమే కాదనుకున్నప్పుడు క్యాజువల్ గా తీసుకోవడమే మంచిదేకదా. అప్పుడు మీరందరు బాధ్యతల్లో మునిగి తేలుతున్నారు. నిజం చెప్పాలంటే అసలు నువ్వెక్కడున్నావో తెలుసుకోవాలన్న ఆలోచన కూడా రాలేదు. అయినా ఇదో ముగిసిన సంఘటన. మొదట్లో ఒంటరితనం కాస్త బాధనిపించింది. అప్పుడప్పుడు మన వాళ్ళు కొందరైనా గుర్తొచ్చేవారనుకో."

" ఆ లిస్ట్ లో నా పేరు వుందా."

"హో..హ్హో.."

"అనుకున్నా ఇంకా అడగలేదేంటా అని. తమర్ని ఎలా మర్చిపోతాం సార్. అంది.. " ఓకే ఇప్పుడు నవ్వు ..హాపీ కదా.. క్వైట్ హాపీ.. ఐయాం లివింగ్ ఇన్ మై ఓన్ వరల్డ్." అమృత అలా అనడంతో కాస్త మనసు కుదుటపడింది. "మాధవ్ వాతావరణం ఎంతో ప్లజంట్ గా వుంది. అనవసర కబుర్లు ఎందుకు. నీ పాట విని ఎన్నేళ్ళయింది. అప్పట్లో నీ పాటకు వీరాభిమానిని. అందులోనూ కిశోర్ "ముసాఫిర్ హూమే యారో" నీ గొంతులో మ్యాజికల్ గా పలికేది. ఒక్కసారి పాడవా ప్లీజ్. అమృత అడగుతుంటే కాదనలేకపోయా.. గొంతు సవరించుకున్నా. పాట కాగానే అమృత చిన్నపిల్లాలా వావ్ అంటూ అరిచింది.

సిల్సిలా కభీ కభీ , చిత్ చోర్ లో జబ్ దీప్ జలే బాలూ మెలోడీలు మధు మాస వేళలో , పూచే పూల లోన పాటలు పట్టుబట్టి పాడించుకుంది. డిగ్రీ రోజుల్లో రోజూ పాటల సెషన్ నడిపే వాళ్ళం. నేను, రాజూ, మాధురీ పాడుతుంటే అమృత రమేష్ లు అద్భుతంగా పాటను వివరించేవారు. అదో అందమైన అనుభవం. వెన్నెల రాత్రిలో పాటలతో జ్ఞాపకాలపై కప్పుకున్న పరదాలు నెమ్మదిగా తొలుగుతున్నాయి. చివరిగా కరుణశ్రీ పుష్ప విలాపం పాడగానే అమృత చప్పున నా చేతులు పట్టుకుంది.

అద్భుతంగా పాడావు. మనసుకు ఎంత రిలీఫ్ గా వుందో తెలుసా. అంటూంటే తన కళ్ళల్లో ఊరిన చెమ్మ ఆ వెలుగులో ముత్యం లా మెరిసింది. చూస్తుండగానే రాత్రి పదిగంటలు అయింది.

" ఓకే మాధవ్ జీ ఈ వెన్నెల రాత్రిని సుమధుర సంగీత విభావరిగా మార్చినందుకు ధన్యవాదములు. " నాటకీయంగా నమస్కరించి ఫక్కున నవ్వేసింది.

*************

పడుకున్నానన్న మాటే గానీ ఓపట్టాన నిద్రపట్టడంలేదు. తల విదిలించి లేచి బయటకు వచ్చి కాసేపు వసారాలో పచార్లు చేసా. పక్క గదిలో అమృత ప్రశాంతంగా నిద్ర పోతోంది. కిటికీలోంచి కనిపిస్తున్న ఆ మనోహర దృశ్యాన్ని అప్రయత్నంగా చూస్తుండి పోయాను. తెలికుండానే గది గుమ్మం దాకా అడుగులు పడ్డాయి. చూస్తున్న కొద్దీ కొత్త అందం ఏదో అమృతలో కనిపిస్తోంది. ఒక్కసారి చూస్తే గుర్తుండి పోయే రూపం తనది. అన్నిటికీ మించి పెదాలపై ఎప్పుడూ చెదరని చిరునవ్వు. కిటికీలోంచి వెన్నెల

కిరణాలు తనపై పడుతుంటే పోత పోసిన శృంగార శిల్పం లా వుంది... పరవశంతో      కూడిన మైకం కమ్ముకొస్తుంటే మనసు వశం తప్పుతోంది. అలా ఎంతసేపున్నానో నాకే తెలిదు. అమృత మరో వైపు తిరిగింది...................................

ఆ తర్వాతేం జరిగింది?

వారి మధ్యనున్న స్నేహబంధం ప్రణయానుబంధమై...పరిణయానికి దారి తీసిందా? మాధవ్ లోని మోహావేశానికి అమృత నుంచి అనూహ్య స్పందనెదురైందా?

ముగింపు వచ్చేవారం........




కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరం. ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలం. కావ్యం రామాయణం సీతాయాశ్చ చరితమ్ మహత్పౌలస్త్య వధమిత్యేవ, చకార చరిత వ్రత:

కమ్మని కంఠంతో మాధుర్యంగా రామాయణ శ్లోకాలు చదువుతున్న తాత గారి వద్ద కెళ్ళి కూర్చు న్నాడు తనయ్ ."తాత గారండీ! చాలా మధురంగా చదువుతున్నారండీ! ఇవి ఏం శ్లోకాలండీ!" అని అడిగాడు . తాత గారు తెల్ల మీసాల చాటు నుంచి మెల్లగా నవ్వుతూ " ఒరే మనవడా ! ఇవి రామాయణం లోని శ్లోకాలురా! "

" తాత గారండీ ! మీరీ వయస్సులో ఇలా రామాయణ శ్లోకాలను వెల్లె వేయటం చాలా ఆశ్చర్యంగా ఉందండీ! అసలు రామాయణం చదవటం వల్ల ఉపయోగం ఉందంటారా? ఉంటే ఏంటో చెప్తారా!"

"సంతోషం రా! కనీసం నీకు రామాయణం గురించి తెల్సుకోవాలనే కోరిక కలగడం నాకు సంతోషంగా ఉందిరా! ఈ రోజు మన టవున్ హాల్లో రామాయణం మీద ఒక చిత్ర ప్రదర్శన ఉంది. నాతో రావోయ్ తీసుకెళ్తాను, నాకూ కాస్తంత సాయంగా ఉంటావు.."

"ఎన్ని గంటలకు తాత గారండీ ?" ,చేతుల్లోని క్రికెట్ బ్యాట్ వైపు చూస్తూ అన్నాడు తనయ్.

" మనం ఒక్క అర గంటలో బయల్దేరాలిరా!..తయారవు మరి..." అంటున్న తాతతో..." మరీ... మరీ... తాతగారండీ ! ..క్రికెట్ ..స్నేహితులు.."అంటూ నసగ సాగాడు.

"తనయ్! తాత గారు దగ్గరుండి రామాయణం చిత్ర ప్రదర్శనకు తీసుకెళ్తానంటే క్రికెట్ అని నసుగుతావేరా! నీ క్రికెట్ మూకనూ తీసుకెళ్ళు అంతా ఒక్క రోజైనా కాస్తంత మంచి విషయాలు తెల్సుకుంటారు.!"పమిట చెంగుకు చేయి తుడుచుకుంటూ వచ్చి చెప్పింది దమయంతి.

"అలాగేలేమ్మా!"అని తనయ్ అంటుండగానే " ఒరేయ్ తనయ్! తనయ్!" అంటూ బయట్నుంచి అరుపులు వినిపించాయి. తనయ్ బయటి కెళ్ళి వాళ్ళకు చెప్పి క్రికెట్ సరంజామా అంతా ఓ చోట భద్ర పరచి అంతా తాత గారితో బయల్దేరారు.

"మామ గారూ! జాగ్రత్త పెళ్ళి కెళ్తూ పదకొండు పి[ల్ల]ల్లుల్ను తీసుకెళుతున్నారు.." అంటూ నవ్వింది దమయంతి. "పిల్లులకంతా రామ సుధ పోస్తాన్లేమ్మా! చప్పుడు చేయవు." అంటూ బయల్దేరారు తాత గారు. అంతా నడుస్తుండగా తనయ్ అడిగాడు.

“తాతగారూ! మనం టౌన్ హాల్ కు అర్ధగంట సేపు నడవాలి కదా! మాకందరికీ అసలు రామాయణం గురించే తెలీదు. మీరు ఈలోగా కాస్తంత చెప్తారా?" అని తనయ్ అడిగాడు. తాత గారు నవ్వి" మంచిదిరా! పిల్లలూ మీకు తెల్సుకోవాలనే శ్రద్ధ ఉన్నందుకు నాకు సంతోషంగా ఉందిరా! భారతీయ వాఙ్మయం లో రామాయణాన్ని ‘ఆది కావ్యం’ అంటారు. సంస్కృతము లో దీన్ని వాల్మీకి మహర్షి రచించారు. దాని వల్ల ఆయన ఆది కవిగా సుప్రసిద్ధు లయ్యారు. రామాయణ మహా కావ్యం ఆరు కాండములు (భాగములు)గా విభజింపబడి ఉంది. దీన్లో 24,000 శ్లోకాలున్నాయి. రామాయణము భారత దేశము, హిందూ ధర్మాల చరిత్ర, సంస్కృతి, నడవడిక, నమ్మకాలు, ఆచారాలపై అమిత ప్రభావం చూపుతుంది. రామాయణం లో శ్రీ సీతారాముల పవిత్ర చరిత్ర వర్ణింప బడింది. ఈ మహా కావ్యం తండ్రీ కొడుకులు, భార్యా భర్తలు, అన్నదమ్ములు, యజమాని-సేవకులు, మిత్రులు, రాజు-ప్రజలు, భగవంతుడు-భక్తుడు - మధ్య గల సంబంధ బాంధవ్యాలు, ప్రవర్తనా విధానాలు చక్కగా తెలియజేస్తుంది. చాలా మంది అభిప్రాయములో రామాయణములోని పాత్రలు ఆదర్శ జీవనానికి ప్రమాణంగా స్వీకరింప దగినవని. ఈ కాలంలో చాలా మందికి రామాయణం గురించిన అవగాహన లేక ఏదేదో అనుకుంటుంటారు. పదండి వచ్చేశాం. ముందు మీరు చిత్ర ప్రదర్శన చూడండి. ఆ తర్వాత మీ సందేహాలు అడగండి. జాగ్రత్తగా పరిశీలిస్తేనే మీకు సందేహాలు వస్తాయి. సరా!" అంటూ తాత గారు హాలు లోపలికి దారి తీశారు.

హాల్లోకి అడుగు పెట్టగానే ఎదురుగా హనుమత్ సహిత సీతా రామ లక్ష్మణుల పెద్ద ఆయిల్ పెయింటింగ్ మనస్సును ఆకట్టుకుని, ఆహ్వానించింది. రంగుల సమ్మేళనం, అందం మనస్సులను దోచుకోగా తాత గారితో పాటుగా పిల్లలంతా కూడా అక్కడే చాలా సేపు అయస్కాంతానికి అతుక్కున్న ఇనప ముక్క ల్లా కదలకుండా నిల్చిపోయారు. ముందుగా తేరుకున్న తాతగారు ," చూశారుట్రా పిల్లలూ! ఇదిరా రామ మహత్వం! కదలండి అన్నీ చూద్దాం."అంటూ ముందుకు సాగారు. ఒక్కో చిత్రం వీక్షకులను ఆకట్టుకుంటున్నది. ఒక చిత్రం దగ్గర అంతా ఆగి పోయి ఉన్నారు గుంపుగా. "ఈ చిత్రాన్నిగురించిన విషయం తెల్సుకోవాలని అందరికీ ఎంతో ఆసక్తిగాఉంది. అంతా ఆ స్టేజ్ ముందుకు వస్తే అక్కడ చిత్రకారులు ఉన్నారు. ఆయన అందరికీ వివరిస్తారు" అని నిర్వాహకులు చెప్పగానే అంతా వెళ్ళి, అక్కడ ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు. “రామాయణ మహాకావ్యంలో శత కోటి అక్షరాలని చెబుతారు. కాండము అనగా చెరకు గడ కణుపు అని అర్థము. రామాయణ కథనము చెరకు వలె మధురమైనది గనుక ఈ పేరు సమంజసమని పండితులు వివరిస్తారు. ఒక్కొక్క కాండములోను ఉప భాగములు "సర్గ"లు. వాల్మీకి మహర్షి ఆది కవియే గాక వేదాంతి. దార్శనికుడు. తపస్వి. ప్రజలకు మార్గ దర్శకుడు. సంస్కర్త. కార్యాచరణ వేత్త. రామ నామము సకల పాప హరమనీ, మోక్ష ప్రదమనీ పలువురి నమ్మిక. "రామ" నామము లో పంచాక్షరీ మంత్రము "ఓం నమశ్శివాయ" నుండి 'మ' బీజాక్షరము, అష్టాక్షరీ మంత్రము "ఓం నమో నారాయణాయ" నుండి 'రా' బీజాక్షరము పొందు పరచ బడి యున్నవని ఆధ్యాత్మిక వేత్తల వివరణ. మూడు మార్లు "రామ" నామమును స్మరించినంతనే శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము చేసిన ఫలము లభిస్తుందని శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము-ఉత్తర పీఠికలో చెప్పబడింది. శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ తత్తుల్యమ్ రామనామ వరాననే ----రామాయణం మానవ జీవనానికి ఆదర్శం, అదెలాగో సవివరంగా చెప్తాను..పూర్వం రామగిరి అనే గ్రామంలో చంద్రమణి, రామశేఖరుడు అనే దంపతులకు ఇరువురు కుమారులు ఉండేవారు, విద్యాభ్యాసం పూర్తి చేసి యుక్త వయస్కులయ్యారు. ప్రథమ పుత్రునికి తగిన భార్య కోసం ఆ దంపతులు గ్రామాలన్నీ గాలించి’ రమామణి ‘ అనే ఒక మంచి కుటుంబంలోని కన్యతో వివాహం జరిపించారు. రమామణి కాపురానికి వచ్చింది. ఆమె మంచి విద్యావంతురాలే కాక మంచి చిత్రకారిణి కూడా.

ఆ రోజుల్లో ప్రతి ఇంటా రామాయణ గాథలు ఉండే చిత్రాలు అలంకరించుకుని ఉండేవారు. రమా మణి కూడా తాను స్వయంగా చిత్రించిన రామాయణ దృశ్యాలున్న చిత్రపటాలు తనతో తెచ్చుకుని ఇంటి గోడలపైన అలంకరించింది .ఆమె మరిది కొంత అల్లరి వాడు. అల్లరి మూకతో స్నేహం చేస్తూ రమామణి అందానికి ఆకర్షితుడైనాడు. ఆమెను చాటు నుంచి చూస్తూ, ఒక్కో మారు ఆమె గమనిస్తే ఏదో సైగలు చేస్తూ , కొంత చిత్రంగా, అసభ్యంగా ప్రవర్తించసాగాడు. అన్న భార్య అని, వదిన తల్లితో సమానమనే గౌరవం లేకుండా అతడి ప్రవర్తన కొంత మనస్సుకు కష్టంగా ఉంది రమామణికి. రమామణి సందిగ్ధంలో పడింది. తన భర్తకు తమ్ముడంటే అమిత ప్రేమ. అత్తా మామలు కొత్త. తాను కొత్త కోడలు, వారి మనస్సులు తనకూ తన మనస్సు వారికీ, ఇంకా అర్థం కాలేదు. భర్తతోనూ ఇంకా చనువు ఏర్పడలేదు. పగలంతా కచేరీలో నౌకరీ లో ఉండే భర్త సూర్యాస్తమయం తర్వాత అలసి పోయి ఇంటికి వస్తాడు. మరిది ఇంకా కొలువులో చేరలేదు. అందుకే పని లేక ఈ అల్లరి. ఏమి చేయాలో రమామణికి అర్థం కాలేదు. మరిది ప్రవర్తన గురించి ఇంట్లో ఎవరికి చెప్పినా పెద్ద చిక్కు వచ్చి కూర్చుంటుంది, కొత్తగా ఆ ఇంట కాలు పెట్టిన తనను ఏమనుకుంటారో అనే వేదన! మనస్సంతా భయంతో నిండిపోయింది.మరిది ప్రవర్తన రోజు రోజుకూ భరించ లేని విధంగా ఔతున్నది. సమయం చిక్కితే శరీరాన్ని తాకుతున్నట్లే నడుస్తున్నాడు."సీతా రామా! మీరే నాకు దిక్కు." అని ప్రార్థించుకుంటూ క్షణమో యుగంలా గడప సాగింది. సాయంకాలం అత్త మామలు దేవాలయానికి వెళ్లారు. భర్త ఆ సమయానికి తిరిగి రాడు. ఆ సమయంలో మరిది ఇంటికి వస్తాడు.

భయంతో బిక్క చచ్చి పోతున్న రమామణి ఆ సాయంకాలం దీపం వెలిగించి అన్ని గదుల్లో ఉంచింది. మరిది గది లోనూ దీపం పెట్టి బయటికి వస్తుండగా అతడు గదిలోకి వచ్చాడు. తనకు దారి ఇవ్వకుండా అడ్డుగా నిలిచాడు.ఏం చేయాలో పాలుపోక గోడ మీద తాను చిత్రించిన రాముని చిత్రపటం వద్ద కెళ్ళి నిలిచింది రమామణి. మరిది దగ్గర దగ్గరగా రాసాగాడు, భయంతో ఆమె శరీరం కంపించింది. శరీరం స్వేదమయమైంది. అతడు మరీ మరీ దగ్గరకు రాసాగాడు. వెంటనే రమామణి గోడ మీద ఉన్న చిత్రం లోని సీతను చూపి, తనను చూపుకుంది. ఆ తర్వాత సీతారాములకు కాస్త దూరంగా పెడ తిరిగి నిలుచున్న లక్ష్మణుని చూపి మరిది వైపు చూపింది. అంటే నేను సీతను ,నీ వదినను, నీవు లక్ష్మణుడివి మరిదివి. అనే సూచన చేసి చేతులెత్తి నమస్కరించింది. కొంతసేపు ఆ చిత్రాన్నీ, వదిననూ చూసిన మరిదికి చమటలు పట్టాయి, మనస్సు మారిపోయింది. తన తప్పిదం తెలిసింది. వెంటనే ఆమె పాదాలు పట్టుకుని నమస్కరించాడు. రమామణి ఆ గది వదలి చావిట్లోకి వచ్చి అక్కడ ఉన్న సీతారాముల పట్టాభిషేక చిత్ర పటానికి నమస్కరించి పూల మాల అలంకరించింది. ఇంతలో ఆమె భర్త వచ్చాడు.,ఆ తర్వాత అత్త మామలు వచ్చారు. చూశారా! రామాయణ చిత్ర పట దృశ్యం అల్లరి మరిదిని మార్చేసింది. అందుకే ప్రతి ఇంటా తప్పక సీతారాముల చిత్ర పటాలు ఉండటం శుభ కరం.ఆ కథా దృశ్యమే అందరూ వివరణ కోరిన ఆచిత్రం." అంటూ ముగించాడు చిత్రకారుడు. అంతా అభినందించారు.

తాతగారు పిల్లలందరితో కల్సి ఇంటి దారి పట్టారు." తాత గారూ రేపటి నుండి మాకు రామయణ శ్లోకాలు నేర్పుతారా? మేమందరం వస్తాం." అని అడిగారు పిల్లలు."చాలా సంతోషమయ్యా! మీ కోసమే' బాల రామాయణం' అని రామాయణం మొత్తం 108 శ్లోకాల్లో ఏర్పరచారు, దాన్ని మీకు నేర్పుతాను. మీ అందరికీ ఇష్టమైతే." అన్న తాత గారితో "తప్పక చెప్పండి తాత గారూ రేపు సాయంకాలం ఐదింటికంతా వచ్చేస్తాం." అన్నారు పిల్లలు. తాత గారు సంతోషంగా --

రామాయణ మహాకావ్యమ్ శతకోటి ప్రవిస్తరమ్ ఏకైక మక్షరమ్ ప్రోక్తమ్ పుంసామ్ మహా పాతక నాశనమ్ – అని పాడారు.




పిసినారి పాపయ్య గా పేరు గాంచిన పాపయ్య పట్నానికి వెళ్లి రామపురానికి తిరుగు ప్రయాణమయ్యాడు. రామపురానికి పట్నానికి మధ్య ఒక బాడుగ బండి తిరుగుతుంది. పాపయ్య ఎంత దూరం అయినా నడిచి వెళతాడు గాని బాడుగ బండి మాత్రం

ఎక్కడు. అనవసరం గా ఐదు వరహాలు వృధా అని పాపయ్య భావన. సాయంత్రం దాటి చీకట్లు ముసురుకుంటున్నాయి. దానికి తోడు ఆకాశమంతా మబ్బులు పట్టి సన్నగా వర్షం ప్రారంభం అయ్యింది. సరిగ్గా అదే సమయానికి ఒక బాడుగ బండి రామాపురం మీదుగా వెళ్తోంది. నడిచి వెళుతున్న పాపయ్యను "పాపయ్య! వర్షం పెద్దది అయ్యేలా వుంది. ఈ చీకట్లో తడుస్తూ.. ఇబ్బంది పడే బదులు బండి ఎక్కు, తొందరగా ఇల్లు చేరుకోవచ్చు." బండి లోనుండి కేక వేసాడు పాపయ్య మిత్రుడు. మొండిగా ఈ వర్షం లో నడిచి వెళితే వచ్చే ఇబ్బంది గమనించి ఇక తప్పదన్నట్టు బండి ఎక్కాడు పాపయ్య.

బండి ఎక్కాడనే మాటే గాని "ఐదు వరహాలు" పోతున్నాయ్యానే బెంగ ఎక్కువయింది పాపయ్యకు. వర్షం పెద్దది అయింది. బండిలో అందరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటుంటే.. పాపయ్య మాత్రం "ఐదు వరహాలు" బాడుగ ఇవ్వకుండా ఎలా తప్పించుకోవాలో మనసులోనే ఒక పథకం వేసుకున్నాడు. రామాపురం సమీపిస్తుందనగా పాపయ్య బండి నుండి దూకి కావాలని బొక్క బోర్లా పడ్డాడు. బండి నడిపేవాడు కంగారుగా బండి ఆపి పాపయ్య దగ్గరికి వెళ్ళాడు.

పాపయ్య కుంటుకుంటూ లేచి బండి వాని చొక్కా పట్టుకుని "కాళ్ళు విరగ్గొట్టావు కదరా! పదా గ్రామాదికారి వద్దకు" అని పెద్దగా అరిచేసరికి బెంబేలు పడిన బండి వాడు "క్షమించండి! పిల్లలు గల వాణ్ని నన్ను వదిలేయండి" అని బ్రతిమాలేసరికి పాపయ్య బండి వాడిని వదిలేసాడు. పాపయ్య పెద్ద మనసుకి బండి లోని వారందరూ ప్రశంసించారు. బండి వాడు ఐదు వరహాలు బాడుగ అడగకుండా తన దారిన తను వెళ్ళాడు. ఐదు వరహాలు మిగలడం తో పాటు, పైగా తనది దయార్ద్ర హృదయమని పేరు కూడా రావడం తో.. తన పథకం పారిందని సంతోషం తో ఇల్లు చేరిన పాపయ్యకు గుండె గుబేల్ మంది. బండి నుండి దూకే సమయంలో తన సంచిని బండిలో వదిలేసాడు. అందులో "యాభై వరహాలు" వున్నాయి. అందుకే "లోభికి ఖర్చు ఎక్కువ" అని పెద్దలు అంటుంటారు.




" అమ్మా పనిమనిషిని మాన్పించేయ్ నేను ఆలోచించుకున్నాను " ఆరేళ్ళ చిన్ని అమ్మ నుద్దేశించి అంది .

" నాన్నకి కూడా చెప్పేయ్ ". తలుపు మూలనున్న చీపురు చేతిలోకి తీసుకుంటూ మళ్ళా అంది చిన్ని .కూతురు మాటలకి సన్నని దరహాస రేఖ కనబడింది అమ్మ మోములో .

ఊ ... సరే ..... " అంటూ మూతి ముడిచింది . ఆ విరుపుకి ముక్కుపుడకలోని వజ్రం తళ్ళుక్కు మని మెరుస్తూ ఆ మెరుపు చెంపలలో ప్రతిఫలించింది . అమ్మ చెంపల మెరుపుని , ముక్కెర తళుకుని చూడడం ఎంతో యిష్టమ్ చిన్నికి .

" బుచ్చన్నయ్యా , నువ్వేంనాకు బలపాలు , పెన్సిళ్ళు యివ్వఖర్లే , యించక్కా నువ్వొక్కడవే వాడుకోవచ్చులే " .

" ఏం నాన్నారు నీకు కొత్తవి కొంటున్నారా ? , అమ్మా నాకూ కొత్తవే కావాలి యిప్పుడే చెప్పేస్తున్నా ? " అరిచేడు గోపి .

" సరే ..సరే స్కూలుకి టైం అవటంలే బయలు దేరు " తొందర పెట్టింది అమ్మ .

" చిన్నీ ఇస్కూలు బడికి " పెరటి తలుపు దగ్గర నుంచి కేక వినబడింది .

" మీ ఫ్రెండు తార కూడా వచ్చింది పద " గోపి చిన్నిని తొందర పెట్టేడు .

" అది రేపొస్తుందిగాని మీరు వెళ్ళండి " . అమ్మ కల్పించుకొని అంది .

గోపి పుస్తకాల సంచి చేతికి తగిలించుకొని రెండో చేత్తో పలక పట్టుకొని నోటితో బుర్ ...... మని శబ్దం చేసుకుంటూ వీధిలోకి పరుగెత్తేడు . అమ్మ స్టేట్ మెంట్ తో సందేహానికి లోనయ్యింది చిన్ని . నిన్న నాన్నగారు క్లాస్ పుస్తకంలో పెన్సిల్ తో చుక్కల ముగ్గు వేస్తే , చదువు మీద శ్రద్ధలేదు యిలాఅయితే పనిమనిషిని మానిపించేస్తాను యింట్లో కూచొని అంట గిన్నెలు తోముకో , లేదా ముగ్గులు , సినిమా పాటలు కట్టిపె ట్టి బుద్ధిగా చదువుకో , ఆలోచించి యేవిషయం చెప్పు అని అనలేదూ ? యిందాక అదే విషయం అమ్మతో చెప్పాగా ! మరి అమ్మేంటి రేపు స్కూలుకి వెళ్లమంటోంది . ఏంటో యీ పెద్దవాళ్ళు యేదీ అర్ధమయ్యేటట్లు చెప్పరు మనం యేమైనా అంటే అదోలా చూసి ముసి ముసిగానో , పకపక మనో నవ్వేయడం . పనిమనిషిని మాన్పించమని చెప్పాగా ? యిల్లు కుడా వూడుస్తున్నాగా ? తరవాత గిన్నెలు ... గిన్నెలు అనుకోగానే అరటి చెట్ల పక్కన బురదలో పడేసిన అంట గిన్నెలు నల్లని ముఖాలతో నవ్వుతున్నట్లు కనిపించేయి . అమ్మో ఆ బురదలో .... కంపు ...... గిన్నెలు ... తోమేటప్పుడు చేతులకి నలుపు అంటుకుంటుందేమో ? మల్లెపూవు కి తేనె కలిపింట్టుండే రంగులో వున్న తన చేతుల వైపు చూసుకుంది . గిన్నెల నలుపు అంటుకొని తన చేతులు కూడా ఆదెమ్మ చేతుల్లా అయిపోతాయా ? అమ్మో యింకా వోగది వూడ్వడమే పూర్తి కాలేదు చేతులు నెప్పెడుతున్నాయి . పోనీ పని మనిషిని మానిపించ కుండానే చదువు మానేసె మార్గం వుందా ?

" వోలమ్మ వోలమ్మ ... మాలచ్చిమి తల్లి సీపురొట్టుకుందేటి ? నివ్వేటి మహారానీ నాగా కూకోని పని సేయించుకోవాల గాని యిదేటిదేటి .... జల్లి .... జల్లి.... సీపురు జల్లి " .

" నీ పేరేంటి ఆదెమ్మా ? , అంటే మీ అమ్మా నాన్నా పెట్టిన పేరు " చిన్నన్న విస్సు అడిగేడు .

" ఆది లచ్చిమి "

" ఒకవేళ నీ పేరు రత్న ప్రభ అనుకో అప్పుడు నిన్ను యేమని పిలుస్తారు రత్తీ అనా రత్తమ్మా అనా ? "

" మరంతే గదేటి అనాగే పిలుత్తారూ "

చిన్నన్నయ్య చిన్ని వేపు చూసి కళ్లెగరేసేడు .

అమ్మో తనని అందరు రత్తీ ... రత్తమ్మా ....అని పిలుస్తారా ? పోనీ నాన్నకి తెలియకుండా ముగ్గులు నేర్చుకుంటూ , కొంచెం చదువుకుంటూ వుంటే బాగుంటుందేమో .

అమ్మో , చిన్నన్నో స్కూలుకి పో చిన్నీ అంటారని , అనాలని ఎదురు చూస్తోంది చిన్ని .యింతలో వంటింట్లోంచి పెద్ద పెద్ద అడుగులు వేస్తూ నాన్నత్తొచ్చింది . యింట్లో యెంత పెద్ద గొడవ జరిగినా ప్రేక్షకురాలిలా వుండి పోయే నాన్నత్త , రాత్రి తొమ్మిదింటి వరకు మడిని , వంటిల్లుని వదలని నాన్నత్త " చిన్నీ పద బడికి " అంటూ చిన్ని రెక్క పుచ్చుకొని గోర గోరా యీడుస్తున్నట్టుగా తీసుకు వచ్చి స్కూల్లో దింపి " బాగా చదువుకో " అంది .

" చెయ్యినొప్పి నాన్నత్తా " అంటూ నాన్నత్త వైపు చూసిన చిన్ని గతుక్కు మంది కాశ్మీరీ ఆపిల్ రంగులో వుండే నాన్నత్త ముఖం కోపంతో మరింత యెర్రబడి ముక్కు పుటాలు వెడల్పుగా అయి అదురుతున్నాయి . నాన్నత్తని ఆ రూపంలో ఎప్పుడూ చూడలేదు . నాన్నత్తకి కోపం యెందుకొచ్చిందో అర్థం కాలేదు చిన్నికి .

నాన్నత్త తో సమానంగా నడవలేక పరుగెత్త వలసి వచ్చింది చిన్నికి . నాన్నత్త అలా యీడ్చుకొని తెచ్చినట్లు తీసుకురావడం ఎంతమాత్రం నచ్చలేదు . ఎలాగూ స్కూలికి వెళ్ళడమే మంచిది అనే నిర్ణయానికి వచ్చేను కదా ! అంతలోనే యిలా యీడ్చుకు రావడం బావుందా ? వీధిలో అందరూ చూస్తూవుండగా నాన్నత్త అలా యిడ్చుకొని రావడం కొంచెం అవమానంగా కూడా అనిపించింది . ఏమిటో యీ పెద్దవాళ్లు పిల్లలని యెప్పుడూ అర్థం చేసుకోరు . ఏమిటో యివాళ పొద్దున్న నుంచి అన్నీ యిలాగే జరుగుతున్నాయి . స్కూలు మానెయ్యొచ్చు కదా అనే ఆనందం లో ప్రొద్దున్నే అర చేతులు చూసుకొని లేవాలన్నది మరచి పోయినందుకా అనుకొంది .

" ఏంటి పిల్లా ఆలిసంగా ఒచ్చినావూ " అంటున్న తోటి అమ్మాయి మాటలు వినబడనట్టుగా పుస్తకంలోకి చూస్తూ కూర్చుంది . ఆలోచనలు మాత్రం నాన్నత్త చుట్టూ తిరగసాగేయి .

నాన్నత్తకి యెందుకంత కోపం వచ్చిందో ?

నాన్నత్త టే ఎంతో యిష్టమ్ చిన్నికి . అమ్మలాగే పచ్చని శరీర ఛాయా , పావలా బిళ్ళంత బొట్టు , చేతులనిండా బంగారం గాజులు మధ్య మధ్యలో గాజుగాజులు , ముడివేసిన పెద్దజుట్టు లో యెప్పుడూ యెర్రని మందారపువ్వు . పసుపు రాసిన పాదాలని ముద్దాడు తున్నట్లుండే పాంజేబులు , వాటి పైన అందెలు కచ్చ పోసి కట్టిన చీరలోంచి నడిచేటప్పుడు కనిపించేవి . అందగత్తెలలోకి అందగత్తెగా వుండేది .

" మీ నాన్నత్త మీ యింట్లోనే ఎందుకుంటుంది " అనే దోస్తుల మాటలకి ఏం చెప్పాలో అర్ధం అయేదికాదు .

అమ్మని అడిగితే " మీ తాతయ్య నిర్వాకం తల్లీ " అనేది . తాతయ్య అంటే నాన్నగారికి తాత . నాన్నత్తని అడిగితే " ఖర్మ తల్లీ ఖర్మ ఏ జన్మలోనో, యే జంటనో విడదీసి వుంటాను యీ జన్మలో యిలా ..." వెక్కుతూ కళ్లు తుడుచు కొనేది . తల్లి మాటలు గాని నాన్నత్త మాటలు గాని అర్ధం అయేవి కావు . అర్ధం చేసుకునేంత వయసు కుడా లేదు చిన్నికి .

చిన్ని స్కూలు ఫైనల్ పాసయేక పై చదువులకి పంపాలా , పెళ్లి చేసి అత్తవారింటికి పంపాలా అనే విషయంపై చర్చ జరుగుతున్నప్పుడు " పై చదువులకు పంపరా విద్య వివేకాన్నిస్తుంది , దాని మంచి చెడ్డ అది తెలుసుకోగలుగు తుంది " అంటున్న నాన్నత్త మాటలలో మళ్లీ అదేకోపం ముఖం యెర్రబారడం చూసింది చిన్ని .

కాలేజ్ కి వెళ్తుతున్న ఆనందంలో నాన్నత్త మాటలు అర్ధం కాకపోయినా పట్టించుకోలేదు , ప్రభ గా మారిన చిన్ని . కాలేజ్ చదువు ప్రభకి జ్ఞానం అనే ఖజానా కి తాళంగా వుపయోగ పడింది . అప్పుడు నాన్నత్త మాటలకి అర్ధం తెలియసాగింది .

పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో వుండగా నాన్నగారి రిటైర్మెంట్ కి ప్రభ అన్నయ్యలు అంతా యింట్లో చేరి హడావిడిగా వున్నప్పుడు వో చిన్న మాటలో నాన్నత్తకి మళ్ళా కోపం వచ్చింది .

యీ సారి నాన్నత్తకి కోపం రావడానికి కారణం ప్రభ కాదు , నాలుగేళ్ల ప్రభ మేనకోడలు లాస్య .

తాతగారికి పూలదండలు వేసి అభినందిస్తున్న దృశ్యం చూసిన లాస్య తనవొంతుగా పుట్టిన రోజు పాటని శ్రావ్యంగా వినిపించింది .

" పుట్టిన రోజు కాదే పిచ్చిపిల్లా తాతగారు రిటైర్ అయ్యేరు " లాస్యని ముద్దుగా హత్తుకుంటూ అంది ప్రభ .

"రిటైర్ అంటే " కుతూహలంతో చారడేసి కళ్లు చేసుకొని అడిగింది లాస్య .

" పొట్టనిండా ప్రశ్నలేనే నీకు . రిటైర్ మెంట్ అంటే రేపటి నుంచి ఆఫీస్ కి వెళ్ళక్కర లేదన్న మాట ".

" వెంటనే అత్త దగ్గర నుంచి నాన్న దగ్గరకి వెళ్లి " నాన్నా నేను కుడా రిటైర్ అయ్యేను రేపటి నుంచి స్కూల్ కి వెళ్ళను " అని డిక్లేర్ చేసింది .

" అలేగే నువ్వు రిటైరు సరేనా " అంటూ అంతా ముద్దు చేస్తూవుంటే ,

" తోటకూర కాడ సెప్పనయితిని కొడకా అని ఏడ్చిందిట మునుపటికి మీలాంటిదే వొకర్తి అలా వుంది మీ వరస , యిలాంటి వన్నీ మొగ్గలోనే తుంచెయ్యాలి " అంటూ విసవిసా లాస్యని లోపలి తీసుకెళ్లిపోయింది నాన్నత్త .

రెండు నిముషాల తరువాత నాన్నత్త చెయ్యి పట్టుకొని వచ్చిన లాస్య చేతులతో చెవులు పట్టుకొని "సారీ నాన్నా యింకెప్పుడూ చదువుకోను అననుగా " అంది .

ఎన్నాళ్ళగానో నాన్నత్తని అడగాలను కున్న సందేహాలు యివాళ తీర్చుకొవాలని నిశ్చయించుకుంది ప్రభ .

అసమానమైన అందం , మూర్తీభవించిన మంచితనానికి కేర్ ఆఫ్ అడ్రెస్స్ లా వుండే నాన్నత్త భర్తకి ఎందుకు దూరమయ్యింది ? , యీ వయసులో యింత అందంగా వున్న నాన్నత్త వయసులో వున్నప్పుడు యింకెంత అందం గా వుండేదో ? , యింతటి అందాల రాశిని నాన్నత్త భర్త వద్దను కున్నాడా ? నాన్నత్తే భర్తని కాదనుకుందేమో అని అనుకుందామంటే యిన్నేళ్లుగా నాన్నత్తని చూస్తున్న ప్రభ మనస్సు అంగీకరించలేదు .

ఎప్పటిలాగే ప్రభ మంచం పక్కన కొంగు పరచుకొని నిద్రకి వుపక్రమిస్తున్న నాన్నత్తని వారించి " మంచం మీద పడుకో నాన్నత్తా , కింద పడుకుంటే వాతం చేస్తుంది " . అంది ప్రభ .

" మొండి ప్రాణం వాత నొప్పులికి పోదులే , అంత సున్నితమైతే ఆ మహానుభావుడు పత్రాలు పంపినప్పుడే పోదూ ? " .

అదే అదనుగా గబుక్కున లేచి నాన్నత్త పక్కన కూర్చొని " యిప్పుడు పెద్దదాన్ని అయేనుగా ? నువ్వు చెప్పేవన్నీ అర్థం అవుతాయిగా ? నాన్నత్తా మావయ్య నిన్నెందుకు వదిలేసాడు ? చెప్పవా ? "

" నీకు కాక యింకెవ్వరికి చెప్తానే భడవా ? ముద్దు ముర్ఖంగా మారకూడదు అనేదానికి నా జీవితమే వుదాహరణ . మా అయ్య కి ( నాన్నత్త వాళ్ల తండ్రిని అలాగే పిలిచేది ) ముగ్గురు మొగపిల్లల తరవాత పుట్టిన దాననని ఏంతో ముద్దు . నన్ను వో మంచి ముహూర్తమో చెడు ముహుర్తమో స్కూల్లో వేసేరు . మేష్టారి చేతిలో బెత్తం చూస్తే భయం వేసి , బడికి పోను అంటే మా అయ్య ' నీకు చదువుకునే ఖర్మమేమిటమ్మా , బడికి పొవొద్దులే ' అంటే నా ఖర్మ బాగుంది కాబట్టి నేను చదువుకో అక్కరలేదు అనుకున్నా . చదువు కోకపోవడం వల్ల నా బతుకు యిలా తగల బడుతుందని అనుక్కోలేదే ? . తన ముద్దుల కూతురుకి పెద్దింటి సంబంధం చెయ్యాలని చెన్నపట్నం సంబంధం చేసేడు అయ్య . పెళ్ళప్పుడు పట్టా చదువుతున్నారు ఆయన . తరవాత యింకా యేవేవో చదివేరుట . వివాహం విద్యా నాశయః అంటారు , అందుకని చదువు అయేకా నన్ను తీసుకు వెళ్తారు అని ఎదురు చూస్తున్నాను " .

" చదువు రాని దానివని నిన్నొదిలేసి మరో పెళ్లి చేసుకున్నారా మావయ్య " కోపంతో మొహమంతా ఎర్రబడగా అంది ప్రభ .

" తప్పు తప్పు ఆ మహానుభావుడిని గురించి అలా అనుకుంటే కళ్ళు పోతాయి . వుండు నిరుడు వచ్చిన యీ వుత్తరం , యీ కాయితాలు చదువు . మీ నాన్న చెప్పడం ఆ మహానుభావుడు ఆస్తి నా పేర రాసి ఏదో ఆశ్రమం లో చేరి సన్యాసం పుచ్చుకున్నారుట , పాపిష్ఠి దాన్ని భర్త సేవ చేసుకోవడం మాట అలా వుంచు పెళ్లి లో తప్ప అతనిని చూడనైనా లేదు . నాకెందుకే యీ ఆస్థి ? , నేనేం చేసుకుంటానే ? యీ ఆస్థి నీకిస్తున్నాను . నాలాగ యెవరూ చదువులేక అన్యాయం అయిపోకూడదు . నువ్వు చదువుకున్న దానివి ఎలా యీ ఆస్తిని వుపయోగిస్తే బాగుంటుందో అలా చెయ్యి " అంటూ వోపెద్ద కవరు ప్రభ చేతిలో పెట్టి , యింక మాట్లాడేది ముగిసింది అన్నట్లుగా గోడవైపు తిరిగి పడుకుంది నాన్నత్త .

గబగబా కాయితాలు చదివిన ప్రభకి అర్ధమయ్యింది యేమిటంటే నాన్నత్తంటే మావయ్య గారికి యెంతో యిష్టమని , వుద్యోగ విరమణ వరకు నాన్నత్త తో కలిసి ఉండడానికి యెన్నో ప్రయత్నాలు చేసేరని తెలుసుకుంది . నాన్నత్తంటే మావయ్యగారికి యిష్టం , మావయ్యగారంటే నాన్నత్తకి యిష్టం మరి యీ కధలో విలన్ యెవరు . అదే విషయం నిద్రకి వుపక్రమిస్తున్న నాన్నత్తని లేపి అడిగింది .

" నా బతుకు యిలా తెల్లవారడానికి కారణం ' విధి ' అని సరిపెట్టు కోవాలేమో ? మా అయ్యకు నామీద వున్న పిచ్చి అభిమానం వొక కారణమైతే , నేను చదువుకోకపోవడం మరో కారణం . నన్ను వదిలి వుండలేని మా అయ్య ప్లీడరు గుమస్తా యిచ్చిన సలహాతో విడాకుల కాయితాలమీద వేలిముద్రలు వేయించేడు అవేమిటో వాటి వల్ల జరిగే అనర్ధం ఏమిటో తెలిసే సరికి నా బతుకు తెల్లారి పోయింది . మోడులా యిలా బతికే బదులు చచ్చిపోవాలని చాలాసార్లు అనుకున్నాను కాని బలవంతపు చావు చస్తే ఆత్మ నరకానికి పోతుంది అంటారు . అలా జరిగితే ఆలోకంలో నైనా నాదేవుడిని కలిసే అవకాశం పోగొట్టుకుంటాను కదా ! అందుకని అ ఆలోచన విరమించుకుని యిలా రాయిలా బతికేస్తున్నా " .

" నీ కధకి మీ అయ్య విలన్ అన్నమాట " .

" మా అయ్య మూర్ఖుడే , అతను కుడా నిశానివే , అత్తవారింటికి పంపితే తన పిల్ల అలసిపోతుందని అనుకున్నాడే గాని , కూతురు జీవితాన్ని నాశనం చేస్తున్నాడని తెలుసుకోలేని అమాయకుడే . విలనో గిలనో అంటూ వుంటే అది ' అజ్ఞానం ' మాత్రమే , యీ అజ్ఞానం అనే అంధకారాన్ని పోగొట్టడానికి విద్య అనే దీపం కావాలి , ఆ దీపాన్ని అందుకొని వెలుగుని అందరి జీవితాలలోకి తీసుకొని వెళ్ళే చేతులు నీవి కావాలి . అందుకే నీకా బాధ్యతని వొప్ప జెప్పుతున్నాను . నువ్వు యీ బాధ్యతని సమర్ధ వంతంగా నిర్వర్తించ గలవని నాకు తెలుసు . ఇప్పటికే చాలా రాత్రయింది యింక నిద్రపో " అంటూ కొంగు కప్పుకొని నిద్రకి వుపక్రమించింది .

నాన్నత్త కోపానికి అర్ధం తెలుసుకున్న ప్రభ నాన్నత్త ఆశయాన్ని నెరవేర్చాలని తనకు తానే వాగ్దానం చేసుకుంది . తరతరాలుగా తమ యింట్లో పని చేస్తున్న ఆదెమ్మ మనవరాలు లక్ష్మే తన మొదటి దివ్వే కావాలి . రేపే వాళ్ల వాడకి వెళ్లి లక్ష్మి వయసు వాళ్లతో నాన్నత్త ఆశయానికి నాంది పలకాలి . మంచి పనికి ముహూర్తం చూడవలసిన పని లేదు . భారత దేశం నుంచి నిరక్షరాస్యతను పారద్రోలినట్లు , దేశ ప్రజలు విద్యావంతులు గాను వివేక వంతులుగాను అయినట్లు , నాన్నత్త కౌగలించుకొని అమ్మలూ నా కోరిక తీర్చేవే అంటూ వెన్ను నిమురుతున్నట్లు ఏవేవో కలలతో కలత నిద్ర పోయింది ప్రభ .




గతసంచికలో ఏం జరిగిందంటే..http://www.gotelugu.com/issue139/3561/telugu-stories/amruta/

........................................చటుక్కున ఈ లోకం లోకి వచ్చాను. ఒక్కసారిగా తల విదిల్చా. ఛా ! తప్పుచేస్తున్నానా అనిపించింది. వెంటనే గదిలోకి వచ్చేసాను. లాభం లేదని బ్యాగ్ లోన్చి జండుబాం తీసి కళ్ళకు పట్టించి పడుకున్నా. ఎంత పని జరిగింది. ఒకవేళ అమృత చూసి వుంటే? మై గాడ్..! ఒక్కసారిగా పాతాళం లో పడిపోతున్న ఫీలింగ్!

కళ్ళు మూసుకున్నా, మనసు అమృత చుట్టే తిరుగులోంది. డిగ్రీ మూడేళ్ళు తనను ఎంతగా ఆరాధించే వాణ్ణో నా కన్నా తనకే తెలుసు. క్లాస్ మేట్స్ అందరికీ ఈ విషయం తెలుసు. కాని అదేంటో తను నా పై ఆసక్తి కనబరచిన సంఘటన ఒక్కటి కూడా లేదు. అయినా మనసులో ఏదో నమ్మకం. తన మనసులో నేనున్నానని, ఆలోచనలు వెనక్కి వెళుతున్న కొద్దీ జీవితం ఇప్పటి కన్నా పచ్చగా, మధురం గా అనిపించసాగింది . ఈ అయిదేళ్ళలో ఎప్పుడూ ఇంత ఆనందించిన క్షణాల్లేవు. డిగ్రీ కాగానే నాన్న ఆకస్మాత్తుగా కనుమూయడం, కారుణ్య నియామకంగా ఉద్యోగం రావడం .. ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళూ ఒకదాని వెనుక ఒకటి వరుస సంఘటనలన్నీ మహా ప్రవాహం లా వచ్చి నా జీవితాన్ని లాగేసాయి. ఈ సందడిలో పెళ్ళిచేసుకోవాలన్న ఆలోచన కూడా రాలేదు. రాలేదు అనడం కన్నా అనుకోలేదు అంటేనే బెటర్. అలా అనుకోకపోవడానికి అమృతపై నా క్రష్ కారణమా? అంటే నా వద్ద సమాధానం లేదు. అలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నా

.

**********************

"కల్యాణ గోపాలం.. కరుణాల వాలం" నారాయణ తీర్థుల తరంగం వున్ని కృష్ణన్ గొంతులోంచి స్వరధారలా వుబికి వస్తుంటే మెల్లగా కళ్ళు తెరిచాను. పాట ఎంత అద్భుతంగా వుంటుందో, ఎన్ని సార్లు విన్నా గుండె ఇట్టే కరిగిపోతుంది. కిటికీలోంచి చూస్తే... అప్పుడప్పుడే తెల్లారుతున్న మనోహర దృశ్యం కనిపించింది. రూం నుంచి బైటికి వచ్చాను. అమృత లేచినట్టుంది. ఆ మసక వెలుతురులో బ్లూ జీన్స్, జుబ్బా వేసుకుని మొక్కలకు నీళ్ళు పడుతున్న తనను చూస్తుంటే "చీకటి నవ్విన చిన్ని వెలుతురివా... వాకిట వెలసిన వేకువ తులసివా" అన్న తిలక్ పద్యమే గుర్తొచ్చింది. బహుశా తిలక్ మనో ఫలకం పై ఇలాంటి దృశ్యమే మెరిసిందేమో! టీపాయ్ పై వున్న పేపర్ తిరిగేస్తుంటే అమృత వచ్చింది.

"హాయ్.. గుడ్ మార్నింగ్.. త్వరగా ఫ్రెషప్ అయిరా.. అంటూ" లోపలికి వెళ్ళింది. నేరుగా తన మొహం లోకి చూడలేకపోయాను. నిన్న రాత్రి తప్పు చేశానేమోనని మనసులో తెలీని అలజడి. మౌనం గా వెళ్ళి ఫ్రెషప్ అయ్యాను. త్వరగా ఇక్కడ్నుంచి బైట పడటం అనిపించింది. చకచకా సూట్కేసు సర్దుకున్నాను. "కాఫీ రెడీ" అమృత కేకతో బైటికి వచ్చా. టీపాయ్ పై కాఫీ కప్ పొగలు కక్కుతోంది.

మౌనం గా సిప్ చేస్తుంటే

"ఏంటీ డల్ అయిపోయావు. డిల్లీ గుర్తొచ్చిందా" అంది అమృత.

"ఆ.. వెళ్ళాలిగా పనులు బోల్డెన్ని వున్నాయి" నా గొంతు నాకే కృతకంగా వినిపించింది.

"ఓకే సర్ యాజ్ యూ లైక్. అయితే ఓ కండీషన్ .. ఇవాళ ఊర్లో చిన్న పిల్లల కార్యక్రమం వుంది. అది చూసుకుని వెళ్దువు గానీ సరేనా!అమృత మాటలకు నో చెప్పలేకపోయాను. నా మనసులో భావాలు తెలిస్తే ఎంత వైల్డ్ గా రియాక్ట్ అయ్యేదో ఊహించుకుంటూనే తలూపాను.

కార్యక్రమం చక్కగా సాగింది. పిల్లలపై అమృతకున్న ప్రేమ కన్నా .. ఆ ఊరి ప్రజలకు ఆమెపై వున్న నమ్మకం అడుగడుగునా కనిపించింది. వారితో తను మమేకమైన తీరు చూస్తే చాలా ముచ్చటేసింది. ఆ తర్వాత నన్ను పరిచయం చేసింది. చివర్లో వెళుతూ వెళ్తూ

"అమృతా అప్పుడప్పుడు ఈ ఆశ్రమానికి రావచ్చా?" అడిగా నవ్వుతూ తలూపింది. రెండడుగులు వేసి ఆగాను.

"నీ కాంటాక్ట్ నెం.."

గట్టిగా నవ్వింది.

నాకూ ఇవ్వాలనే వుంది. ఏం చేయను? సెల్ వాడనుగా...! అంటుంటే

పెదాలపై బలవంతం గా నవ్వు పులుముకుంటూ కదిలాను.

...........సరిగ్గా పదిరోజులు తర్వాత .. అమృత నుంచి

నా కళ్ళు అక్షరాల వెంట పరుగులు తీశాయి.

మాధవ్.. ఈ పాటికే నువ్వు బిజీగా మారిపోయి వుంటావని అనుకుంటున్నాను. జీవితం ఇలాగే వుంటుంది మరి. నడుస్తున్న కొద్దీ కొన్ని దృశ్యాలు వెనుకవుతుంటాయి. అవి గతం అనే ఖాతాలో జమవుతుంటాయి. నన్ను కలిసినప్పుడు ఎంత ఉద్వేగానికి లోనయ్యావో నాకు తెలుసు. ఆ రోజు రాత్రి గుమ్మం వద్ద నిలుచుని నా వైపు తదేకంగా చూసింది కూడా తెలుసు. ఓ మాట చెప్పనా... నువ్వు వెనుదిరిగి గదిలో వెళ్ళిన ఆ క్షణాన నీ పై గౌరవం రెట్టింపయింది. మాధవ్ నా గతం మీ కెవరికీ చెప్పలేదు. నేను అనాధగా పెరిగాను. బంధాలు, అనుబంధాలపై పెద్దగా అవగాహన లేదు. డిగ్రీ కాన్వొకేషన్ రోజున నువ్వు ప్రపోజ్ చేయాలనుకున్నట్టు తెలిసే నేను రాలేదు. ఎందుకంటే రెండు రోజుల కిందటే మీ నాన్న లోకం నుంచి నిష్క్రమించడంతో మీ కుటుంబం కుంగి వుంది. నీ పై బాధ్యత వుంది. ఈ వ్యవహారం వల్ల దెబ్బతినరాదనుకున్నా. ఆ తర్వాత కొద్ది కాలానికే నా పెళ్ళి జరిగిపోయింది. కానీ ఇప్పటికీ నా ఆలోచనల్లో వున్నావని తెలుసుకున్నాను. అది వద్దని చెప్పడానికే ఈ ఉత్తరం. బాధ్యతలు ఓ కొలిక్కి వచ్చిన ఈ సమయం లో మంచి అమ్మాయిని జీవితం లో ఆహ్వానించు. ఇప్పటికే చాలా దూరం వెళ్ళిన నాతో నీ ప్రయాణం సాఫీగా సాగదు. బహుశా నాకు కూడా అంతేనేమో! ఇప్పుడు నా ఫస్ట్ ప్రయారిటీ వాత్సల్య . ఓ మాట చెప్పనా.. జీవితం పాతబడిందని ఓ ఎల్ ఎక్స్ లో పెట్టి వదిలించుకోలేం కదా. పాత అనుభవాలను మోసుకుంటూ వున్నా న్నాళ్ళు సాగిపోవాల్సిందే. నాకు నచ్చిన రీతిలో స్వేచ్ఛగా బతకడానికి అలవాటుపడ్డాను. మళ్ళీ జీవితం లో ఏ రకంగా ఆంక్షలు వచ్చినా భరించే స్థితిలో లేను. మనం ఎప్పటికీ మంచి స్నేహితులమే. వాత్సల్యకు నీ ప్రోత్సాహం అవసరం. ఈ సారి జంటగా వస్తావని ఆశిస్తున్నా - చిరునవ్వులో అమృత.

నిశ్శబ్దం గా ఉత్తరం మడిచాను. ఏదో చెప్పలేని భావన మనసులో ముప్పిరిగొంటోంది. జీవితం పై తనకున్న స్పష్టతకు మెచ్చుకోకుండా వుండలేకపోయాను. ఎవరికైనా వారి జీవితంపై ఎక్స్ పెక్ టేషన్స్ వుండటం సాధారణమే. నాలాగా . అయితే కొందరికే జీవితాన్ని యధాతధం గా స్వీకరించాలన్న వాస్తవ స్పృహ వున్న మనస్థితి వుంటుంది. అమృత లాగా . నిజమే తనకు గతం పై అవగాహన వుంది. భవిష్యత్తుపై స్పష్టత వుంది. స్వేచ్ఛగా రెక్కలార్చాలనుకుంటున్న అమృతను ప్రేమపంజరం లో బంధించాలనుకోవడం ఎంత వరకు సబబు? మెల్లగా నా భావోద్వేగం చల్లారి, వాస్తవాలోచనలు కుదురుకోసాగాయి. పోలిక సరి అవునో కాదో తెలీదు గానీ, అమృత ఉత్తరం... అయోమయం లో వున్న అర్జునుడికి కృష్ణుడు ఉపదేశించిన గీతలా అనిపించింది.




ట్రాఫిక్ జాం అవడం వల్ల ఆఫీసుకు ఆలస్యమవుతోంది, ఆలోచనలన్నీ పరుగెడుతున్న టైం చుట్టే తిరుగుతున్నాయి...

ఇంతలో ఎవరో నడివయసు      వ్యక్తి నా మోటార్ సైకిల్ కిందికి రావడం జరిగిపోయింది... వీలైనంత తొందరగానె

బ్రేకు వేయగలిగానుగాని అప్పటికే ఆలస్యమయింది... అతను మూర్ఛపోయినట్లున్నాడు. కొద్దిగా టెన్షన్ ఫీలయ్యాను... కదిలించి చూశాను... కొద్దిసేపు మైండ్ బ్లాకయింది... వెంటనే తేరుకొని.. మా సుపీరియరుకు

విషయం చెప్పి పర్మిషన్ తీసుకున్నాను. ఆ అపరిచితుణ్ణి దగ్గరలో వున్న హాస్పిటల్ కు తీసుకెళ్ళాను. మూర్ఛపోయేంత గాయాలేమి

లేవు. డాక్టర్ గారు చెక్ చేసి ఇంజెక్షనేదో ఇచ్చారు...కొద్దిసేపటికి      మెలుకువొచ్చింది. అప్పుడర్థమయింది,

అతని మూర్చకు కారణం గాయాలు కాదు, తిండిలేకపోవడమని.

చిరిగిపోయిన దుస్తులు, మాసిన గడ్డము, చూస్తూంటె బిక్షగాడిలా వున్నాడు. పళ్ళు తినిపించి పాలు తాగించాను...

దాదాపు సాయంత్రం కావచ్చింది.. ఆఫీసుకు సెలవు పెట్టక తప్పలేదు. అప్పటికి మామూలు స్థితికి వచ్చాడు.

డాక్టరుగారు ఇక భయం లేదు తీసుకెళ్ళొచ్చన్నారు. హాస్పిటల్ నుండి బయటపడ్డాము.

"నీ పేరేంటన్నావు...?"

"రాములండి... మిమ్మల్ని బాగా ఇబ్బంది పెట్టినట్లున్నాను..."

"అదిసరే ఏంజేస్తుంటావు"

మౌనం...

"నిన్నెక్కడ వదలమంటావు..."

వున్నట్లుండి అతని మొహంలో రంగులు మారిపోయాయి... కలవరం కనిపిస్తోంది...

"నేను పడిపోయిన చోటికి తీసుకెళ్ళండి"

అక్కడికెళ్ళాక...

"అయ్యా దారి సరిగ్గా గుర్తులేదు.. ఇలా నేరుగా రెండు ఫర్లాంగులు వచ్చాను.. దానికిముందు కుడివైపు తిరిగాను..

ఆ దారిలో ఇంకో రెండు మూడు ఫర్లాంగులనుకుంటాను... పరవాలేదు మీరికెల్లండి... నేనెల్లిపోగలను"

"అలాకాదు నే తీసుకెళ్తానుండు..." అంటూ అతను చెప్పిన గుర్తుల ప్రకారం ఒక బస్టాప్ దగ్గరికి తీసుకెళ్ళాను....

ఆయన చాలా ఆందోళన పడుతున్నాడు..బస్టాప్ చుట్టూ దేనికోసమో వెతుకుతున్నాడు..అడిగినా సమాధానం చెప్పడం లేదు...

ఇదెక్కడి బాధరా దేవుడా అనుకున్నాను...మనకెందుకు, ఇక వెళ్ళిపోదామనుకునంటున్నంతలో అతను చిన్న పిల్లాడిలా

ఏడ్వడం మొదలు పెట్టాడు... నాకేమి అర్థం కావడం లేదు... కొద్దిసేపటికి నోరువిప్పాడు...

"నా భార్య, ముగ్గురు పిల్లలను ఇక్కడే వదలి పెట్టి వెళ్ళానన్సార్... ఎక్కడికెళ్ళారో ఏమో..."

గొంతులో ఆందోళన..అక్కడే వున్న బంకు దగ్గర నిలుచున్న వాళ్ళను ఆచూకి అడుగుతున్నాడు..అలాంటి స్థిలో అతన్ని

వదిలేసి వెళ్ళిపోలేకపోయాను..ఓదార్చే ప్రయత్నం ఫలించడంలేదు.. ఓ అరగంటకు దూరంగా ఇటు వైపే వస్తూ కనిపించిన

ఒకావిడను, పక్కనున్న పిల్లల్ని చూసి అతని మొహం వెలిగిపోయింది

"అదిగో అక్కడున్నార్సార్.. " అంటూ పరిగెత్తుకెళ్ళి వాళ్ళని తీసుకొచ్చాడు...

ఎక్కడికి వెళ్ళారని ఈయన, ఎందుకాలస్యమైందని ఆమె... ఒకరినొకరు తిట్టుకుంటున్నారు...

"పిల్లలు ఆకలికి అల్లాడి పోతూంటె నీళ్ళైనా తాగిద్దామని తీసుకుపోయానంతె...."

ఏడుస్తోంది...అంతవరకు ఆ హడవిడిలో ఆమె అతని గాయాలను గమనించలేదు..అటువైపు దృష్టి పడగానే ఒక్కసారిగా ఏడుపు వోల్యుం పెంచింది...

"ఏమైందయ్య నీకు... ఏమిటీ గాయాలు... పాపిష్టి దాన్ని చూసుకోకుండానే తిట్టేశాను..." గాయాలను తడిమి చూస్తోంది...

కోపం ప్రేమగా మారిపోయింది...అతను జరిగిందంతా క్లుప్తంగా వివరించాడు...ఆమె నా వైపు చంపేసేలా చూస్తోంది..న్యాయమే కదా..

వాళ్ళ అన్యోన్యత ముచ్చటగా వుంది... వాతావరణం కొంత శాంతించాక వాళ్ళ వివరాలు అడిగాను...

"మాది నాగలాపురమండి... ఇక్కడికి అయిదారు గంటల దూరం..."

"ఇక్కడెవరైనా వున్నారా... పలకరించడానికి వచ్చి దారి తప్పారా..." ఆసక్తిగా అడిగాను...

రాములు మొహం వాడిపోయింది...

"లేదండి... పనికోసం వచ్చాము..." చెప్పుకుంటూపోతున్నాడు...

"నా చిన్నప్పుడు మాకు సుమారు పదెకరాల వరకు పొలముండేదండి... మా అయ్యేమొ దాన్ని రెండెకరాలకు తగ్గించేశాడండి... మొదట్లో మా అయ్య మీద చాలా కోపమొచ్చేదండి...బాధ్యత నా చేతికొచ్చాక గాని అర్థంకాలేదండి. వ్యవసాయంలో నష్టాలేగాని ఏమాత్రం జరుగుబాటుండదని... ఒక సంవత్సరం వానలెక్కువై మునిగిపోతె మరో మూడునాలుగేళ్ళు వానల్లేక మాడిపోయెదండి... ఆశతో అప్పులుజేసి నాట్లేయడం అప్పులుతీర్చుకోవడానికి పొలమమ్ముకోవడం...ఆ మిగిలిన రెండెకరాలు నా చేతుల్లో ఖాళి అయిపోయిందండి... చేసేదేమి లేక ..కూలి పనికూడా దొరక్క ఈ ఊరొచ్చాం సార్..."

మనసంతా బాధగా అనిపించింది...

"బ్యాంకు లోను తీసుకోవచ్చుగా...."

"వెళ్ళాను బాబు... నాపేరు మీద ఎవడో తీసేసుకున్నాడు... బినామి లోను... గట్టిగా అడిగితే బతకలేము... మమ్మల్ని కట్టమని

అడగకుంటేచాలయ్యా ...లోన్లూ మాఫీలూ అన్నీ పెద్దవాళ్ళకే సార్... ఎక్కడో నూటికొకడికి మాలాంటి వాళ్ళకొస్తుంది...ఒళ్ళొంచి

పనిచేయకపోయినా వందెకరాల భూస్వామే రైతు...రెక్కలిరిచుకొని పండించే మాలాంటి చిన్న రైతులంతా కూలీల లెక్కనే బాబు.."

నిజమేననిపించింది....

"ఏం పని చేద్దామని వచ్చారు...?"

"నేను ఏడు వరకు చదువుకున్నానండి..     ఇది కూడ ఐదో క్లాసు వరకు చదువుకుందండి..."

అతని అమాయకత్వానికి నవ్వొచ్చింది...

"అంటే పెద్ద ఉద్యోగాలుచేయాలని కాదండి... " నా అభిప్రాయం అర్థమైనట్లుంది...

"మా ఊరినుండి చాలామంది ఇళ్ళుకట్టె కూలిపని కోసం ఈ ఊరు వస్తూంటారండి... మేముకూడా     అందుకోసమే వచ్చామండి..."

"ఎవరూ తెలియదంటున్నావె... ఎలామరి...?"

"అదేనండి... రెండురోజులుగా వెతుకుతున్నానండి... ఏదైనా కడుతున్న బిల్డింగులదగ్గర మా వాళ్ళేమైనా కనిపిస్తారేమోనని...

పనిప్పిస్తారేమోనని...తెచ్చుకున్న ఏభైఆరు రూపాయలు నిన్ననే అయిపోయాయండి...పిల్లలకు కొనిపెట్టామే గాని మేము

తినలేదండి...

అదికూడా నిన్నటివరకే..."

అతని కళ్ళల్లో నీళ్ళు చూస్తూంటే నాకళ్ళు కూడా చెమర్చాయి...

"మీ ఊళ్ళో మీ వాళ్ళెవరు లేరా...."

"లేకేమండి... ముసలి అమ్మా, అయ్యా వున్నారండి...అర్ధాకలితో మాకోసం ఎదురుచూస్తూ...." వాళ్ళిద్దరి కళ్ళల్లొ జలధార ఆగడం లేదు...

"వాళ్ళను వదిలేసి ఆత్మహత్య చేసుకోలేము... చూస్తూచూస్తు వాళ్ళను కూడా మాతో పాటు చంపుకోలెమయ్యా...."

నాకు నోట మాట రావడంలేదు.... నా జేబులో రెండొందల చిల్లర మిగిలున్నట్లు గుర్తు... రెండొందలు తీసివ్వబోయాను...

తీసుకోడానికి ఏమాత్రము అంగీకరించలేదు... నిజాయితీతో వచ్చిన అభిమానం... పిల్లల పస్తులను గుర్తుచేస్తే, బలవంతం మీద

అప్పుగా తీసుకోవడానికి ఒప్పుకున్నారు...

"ఓ పనిజేద్దాం... రేపు సాయంత్రం సుమారు ఇదే సమయానికి ఇక్కడికొస్తాను... ఒకచోట ఫ్లైఓవర్ నిర్మాణం జరుగులోంది.. అంటె పేద్ద

బ్రిడ్జి కట్టడం జరుగులోంది, అందులో పనిచేసెవాళ్ళు కొంతమంది నాకు తెలుసు...వాళ్ళ సహాయంతొ మీకు పనిప్పించడానికి ప్రయత్నిస్తాను..."

వాళ్ళ మొహాల్లో ఆనందం చూస్తూంటే ఎవరెస్టునధిరోహించినంత సంతోషం అనిపించింది... ఈ చిన్న సహాయమే నాకింత సంతోషాన్నిస్తూంటే

మదర్ తెరీసాలంటి వారి సేవలు వాళ్ళకెంత తృప్తినిచ్చివుండాలి అనిపించింది... ఈ ఆలోచనలతో ఇంటికి బయలుదేరాను...

మరుసటి రోజు సాయంత్రం ఆఫీసు పని ముగించుకొని అనుకున్నట్లుగానే వాళ్ళను ఫ్లైఓవర్ దగ్గర కూలి పనికి కుదిరించి,

నా భాద్యత తీరడంతో తృప్తిగా ఇల్లుచేరుకున్నాను...

రెండునెలలు గడిచాయి... ఒకరోజు ఉదయమే ఓ భయానకమైన వార్త పేపర్లో కనిపించింది... రాములు ఫామిలీని పనిలో చేర్పిన

ఫ్లైఓవర్, నాసిరం క్వాలిటి కారణంగా కూలిపోవడంతో అక్కడే నివాసముంటున్న 52 మంది కూలీల దుర్మరణం... కొన్ని ఫొటోలు కూడా

వేశారు.... వాటిని చూడ్డానికిగాని అక్కడికి వెళ్ళి ఎంక్వైరి చేయడానికిగాని ధైర్యం చాలలేదు... వాళ్ళకేమి అయివుండదు అన్న

ఫీలింగ్ తోనే వుండిపోవాలని నిశ్చయించుకున్నాను... ఆ ఆలోచనలనుండి పారిపోవడానికి ఎంతో ప్రయత్నించాను... అయినా, ఆకలితో

దీనంగా చూస్తున్న ఆ పసిపిల్లల మొహాలు... పల్లెటూళ్ళో కొడుకుకోసం ఎదురుచూస్తున్న ముసలి తల్లిదండ్రుల ఎదురుచూపులు...ఇవన్నీ

గుర్తుకొస్తూనేవున్నాయి... నిద్రలోను అవే ఆలోచనలు...

రైతు ప్రాణానికి విలువే లేదా...? బానిస బ్రతుకొద్దనుకుంటే ఆత్మహత్య ... మొండిగా బ్రతుకు లాగించాలనుకున్నా పరోక్ష హత్య...

మానవత్వం నశించిపోతోంది... స్వార్థపరులైన నాయకుల పడగ నీడలో పల్లెటూళ్ళు శ్మశానాలైపోతున్నాయి..

వయసుడిగిన రాజకీయనాయకులకు కూడా ఇంత స్వార్థమెందుకో...      ఎవరికోసమో... తన రాబోయే వంశంకురాలకు దోచిపెట్టాలన్న

అమాయకత్వమెందుకో...

కట్టె నేలరాలిన నాడు తోడురాదు కనకపు సింహాసనం...

మట్టి బిడ్డల శ్రమే నీపొట్ట నింపుతోందన్న నిజం గుర్తుచేసుకో...

తెల్ల దొరల తోబుట్టువులా తలబిరుసుతో ప్రవర్తించకు...

తల్లి తెరీసా అనుభవించిన అనందపు విలువెంతో తెలుసుకో...

మళ్ళీ మనిషి జన్మ వస్తుందన్న నమ్మకం లేదు.... కాటికి చేరే లోపే.... కాలి బూడిద కాకమునుపే...      కంసుని వారసులారా కళ్ళు తెరవండి .. మీ పుట్టుక విలువ తెలుసుకోండి...




"బుల్లూ, ఆకలేస్తోందామ్మా.."

దాదాపు నాలుగు గంటల నిరీక్షణ తర్వాత లండన్ నుంచి హైద్రాబాదు వచ్చే బ్రిటిష్ అయిర్ వేస్ వారి విమానం యెక్కి, "హమ్మయ్యా.." అనుకుంటూ కళ్ళు మూసుకున్న సావిత్రమ్మ ఆ మాటలకి ఒక్క సారి కళ్ళు తెరిచి చుట్టూ చూసింది. యెక్కడా చిన్న పిల్లలు కనిపించ లేదు. తన పక్కన కూర్చున్నదెవరా అని నెమ్మదిగా తల తిప్పింది. ఒక కుఱ్ఱ జంట. బహుశా ముందు వరసలో యెవరైనా పిల్లలున్నారేమో అనుకుంటూ మళ్ళీ కళ్ళు మూసుకుందావిడ.

"నువ్వు యేర్ పోర్ట్ లో కూడా యేమీ తినలేదు బుల్లూ..నీరసంగా వుందామ్మా.."

మాటలు పక్క సీటు నుంచే. మాట్లాడేది ఆ పక్క జంట లోని పిల్లేనని ఆవిడకి అర్ధమై పోయింది.

అమెరికాలో కూతురి దగ్గర నాలుగు నెలలుండి, వెనక్కి హైద్రాబాదు వస్తున్న సావిత్రమ్మకి అరవైయేళ్ళు దాటాయి. భార్యని పేరు పెట్టి పిలవడమే చోద్యమనుకుంటున్న కుటుంబంలోని ఆవిడ యిన్నేళ్ళ జీవితంలో భర్తని కూడా పేరు పెట్టి పిలిచే రోజులు దాటి, భార్యా భర్తలిద్దరూ ముద్దు పేర్లతో పిలుచుకునే రోజులు వచ్చాయని యెప్పుడో గ్రహించేసింది. అందుకనే పక్కన కూర్చున్న అమ్మాయి మొగుణ్ణి పిలుస్తున్న పిలుపుకి ఆశ్చర్య పోకుండా కళ్ళు మూసుకుని రిలాక్స్ అవుతూ, కళ్ళు చేసే పనిని కూడా చెవులకే అప్పగించేసింది.

"పోనీ పైన కాబిన్ బాగేజ్ లో కుకీస్, చిప్స్ వున్నాయి. తియ్యమంటావా బుల్లూ..నువ్వసలే ఆకలికి ఆగలేవు.."ఆడ గొంతే ఎంతో ప్రేమగా.

"పర్లేదురా బంగారం.."అంది మగ గొంతు.

"అవునూ, యింతకీ యేర్ పోర్ట్ కి మీ అమ్మ గారొస్తారా..మీ నాన్న గారొస్తారా బుల్లూ..?" ఆడ గొంతు అడిగిన ప్రశ్నకి వాళ్ల సంభాషణ ఏకాగ్రతగా వింటున్న సావిత్రమ్మ ఒక్క సారి ఉలిక్కి పడింది.

"తెలీదురా బంగారం.."మగ గొంతు నిరాశక్తత.

"పోనీ మీ యింటికి ఫోన్ చేసి రావద్దని చెప్తావా..యేం లేదూ..నువ్వొస్తున్నావు కదా..నీకు యేమేం యిష్టమో చెప్పమంది అమ్మ. అవన్నీ చేస్తుందిట."

"ఛ, అలా బాగుండదు. అత్తయ్య గారు యేదొండితే అదే తింటాను."

"యెందుకు బాగుండదు? పెళ్లైన రెండేళ్ళకి ఫస్ట్ టైమ్ అత్తారింటికి వస్తున్న అల్లుడివి. మాకు వి.ఐ.పి.వి కదా. యింతకీ మీ అమ్మ గారు యేర్ పోర్ట్ కి వస్తున్నారా..?"

"యేమోరా బంగారం నాకు తెలీదు కదా.."

సావిత్రమ్మకి అర్ధమై పోయింది.

ఓహో..పెళ్లై విదేశాలు వెళ్ళేక మొదటి సారి మళ్ళీ యిండియా వస్తున్నారన్న మాట వీళ్ళిద్దరూ. యెవరి పుట్టింటికి వెళ్ళాలో మొగుడూ పెళ్ళాలింకా తేల్చుకోలేదన్న మాట. సావిత్రమ్మకి కుతూహలం హెచ్చింది. వీళ్ళ మాటలు తప్పకుండా వినాల్సిందే. యెందుకంటే ఈ పిల్ల సీతక్క లాంటిదయితే మారు మాట్లాడకుండా తలొంచుకుని మొగుడి అడుగులో అడుగు వేసుకుంటూ అత్తారింటికి వెళ్ళిపోతుంది. పెద్దక్క లాంటిదయితే పైకి వినపడకుండా పళ్ళు కొరుక్కుంటూ, మొగుణ్ణీ అత్తగార్నీ తిట్టుకుంటూ అత్తారింటికి వెడుతుంది. బుల్లొదినలాంటిదయితే మొగుడితో వాదన పెట్టుకుని, మనసులోనే శాపనార్ధాలు పెట్టుకుంటూ మొహం ధుమధుమలాడించుకుంటూ అత్తారింటికి వెడుతుంది. లక్ష్మొదిన లాంటిదయితే మొగుణ్ణి కొంగున కట్టేసుకుని తన కూడా అతన్ని కూడా వాళ్లమ్మ గారింటికి లాక్కు పోతుంది. మరి ఈ అమ్మాయి యేం చేస్తుందో. "అయినా నా పిచ్చి కానీ ఈ అమ్మాయి మటుకేం తక్కువ తిందనీ. ఇందాకట్నుంచి మొగుణ్ణి యెంతలా బుజ్జగిస్తోందీ "బుల్లూ..బుల్లూ.."అంటూ. యిందుకే నన్న మాట. అమ్మో. . ఈ రోజుల్లో అమ్మాయిలు మహా తెలివైన వాళ్ళు..అని లోలోపల సావిత్రమ్మ అనుకుంటుండగానే యెయిర్ హోస్టెస్ భోజనం తెచ్చింది.

భోజనం తినే వంకతో పక్కనున్న మొగుడూ పెళ్ళాల మాటలు మరింత స్పష్టంగా విన పడేలా మరి కాస్త ముందుకు వంగింది సావిత్రమ్మ.

"మా నాన్న గారు పెద్ద బండి తెస్తున్నారు. నాలుగు సూట్ కేసులూ పట్టాలి కదా. మీ అమ్మ గారికి ఫోన్ చేసి చెప్పు బుల్లూ..పాపం పెద్ద వాళ్లని యెందుకు శ్రమ పెట్టడం.."

"చూద్దాం లేరా బంగారం.."

సావిత్రమ్మకి అర్ధమై పోయింది. ఆ పిల్లాడు చూద్దామూ అన్నాడంటే వాళ్ళింటికే లాక్కు పోతాడన్న మాట. ఈ పిచ్చి పిల్ల పాపం యేడుస్తూ వెడుతుందేమో అనుకుంటుంటే సావిత్రమ్మకి తను కాపురానికొచ్చిన తొలి రోజులు గుర్తొచ్చాయి. అప్పుడాయనా అంతే..కల్లబొల్లి కబుర్లు చెప్పి ఆయన మాటే నెగ్గించుకునే వారు. సానుభూతిగా పక్కనున్న పిల్ల వైపు చూసిన సావిత్రమ్మ తెల్లబోయింది. ఆ పిచ్చి పిల్ల ప్లేట్లో వున్నవి యేమిటో అతనికి తెలినట్టు వివరించి చెపుతోంది.

"బుల్లూ, ఇదిగో..ఈ స్వీటు బాగుంటుంది. తిను. ఈ కూర వొద్దు. నీకు ఆ వాసన నచ్చదు. పప్పు కొంచెమే తీసుకో బుల్లూ..అసలు నువ్వు లండన్ నుంచే మీ అమ్మ గారికి ఫోన్ చేసి రావద్దని చెప్ప వలసింది. పాపం రాత్రంతా మేలుకునుండాలి వాళ్ళు యేర్ పోర్ట్ కి రావాలంటే.."

అమ్మో.. ఈ పిల్ల కూడా తక్కువేమీ తిన లేదు. యెంత వెన్న పూస్తోందీ అతనికీ.. యెలాగైనా తన మాటే నెగ్గించుకోవాలని చూస్తోంది.

తల వంచుకుని తింటున్న సావిత్రమ్మకి ఆ అబ్బాయి గొంతేమీ వినిపించ లేదు. అతను వాళ్ళింటికి ఫోన్ చేస్తాడా చెయ్యడా అని కుతూహలం పెరిగి పోతోందావిడకి.

"స్వీటు నాది కూడా యివ్వనా బుల్లూ..నీకిష్టం కదా.."

అమ్మో.. జాణే..స్వీటు పెట్టేసి అతన్ని తనింటికి తీసుకు పోవాలని చూస్తోంది.

"నాకొద్దురా బంగారం..నువ్వు తిను.."

హమ్మ..హమ్మ..యిద్దరికిద్దరూ యెంత తెలివిగా మాట్లాడుకుంటున్నారూ..ఇదే మా రోజుల్లో అయితే ఇలాంటి గొడవలొస్తే మొగుడూ పెళ్లాలిద్దరూ పక్కన మూడూళ్లకి విన్పించేలా అరుచుకునే వారు. యింతకీ ఆ పిల్లాడు ఆ పిల్ల చెప్పినట్టు యింటికి ఫోన్ చేసి వాళ్లమ్మని యేర్ పోర్ట్ కి రావద్దని చెపుతాడా..లేకపోతే ఈ పిల్లని మాయ మాటలు చెప్పి తనింటికే తీసుకు పోతాడా..

ఆలోచిస్తున్న సావిత్రమ్మకి ఆమెకి తెలికుండానే నిద్ర ముంచుకొచ్చేసింది.

ఫ్లైట్ హైద్రాబాదు చేరింది. సావిత్రమ్మకి తన మీద తనకే చిరాకొచ్చింది,. "మాయదారి నిద్ర. కాస్త కన్ను మూత పడకుండా వుంటే ఈ పిల్లాడు వాళ్లమ్మకి ఫోన్ చేసేడో లేదో తెలిసేది. వయసొచ్చేసింది. నిద్రకాగలేక పోయింది. యిప్పుడు వీళ్ళిద్దరూ అతనింటికి

వెడతారా.. ఆ పిల్లింటికి వెడతారా.

పాపం..సావిత్రమ్మ హడావిడి పడుతూ, వాళ్ళిద్దరూ తన దృష్టిని దాటి పోకుండా వాళ్ల వెనకాలే పరిగెడుతున్నట్లే బైట కొచ్చేసింది. సావిత్రమ్మని యింటికి తీసికెళ్లడానికొచ్చిన కొడుకూ, కోడలూ ఆవిడని చూసి చేతులూపుతున్నా కూడా వాళ్లకో సారి చెయ్యూపేసి వీళ్ల వెనకాల కార్ట్ తోసుకుంటూ కార్లన్నీ ఆగి వున్న చోటుకి వెళ్ళింది.

అప్పుడప్పుడే తెల్లవారుతోంది. మసక వెలుతురులో కళ్ళు పత్తి కాయల్లా చేసుకుని వాళ్ళిద్దర్నీ తన దృష్టి నుంచి పోకుండా అలాగే చూస్తోంది సావిత్రమ్మ.

అదుగో వాళ్ళిద్దరూ..వాళ్లతో పాటు అటూ యిటూ యింకో రెండు పెద్ద జంటలు. బహుశా యిద్దరి తల్లి తండ్రులూ అయి వుంటారు అనుకుంది సావిత్రమ్మ. పాపం అందులో ఒక జంట యెంత చిన్న బుచ్చుకుంటారో..యెప్పటి నుంచో ఈ పిల్లల కోసం చూసి చూసి యెయిర్ పోర్ట్ వరకూ వచ్చిన వాళ్ళు యింటికి రాక పోతుంటే ఆ తల్లి తండ్రుల బాధ చెప్పడం యెవరి తరం. ఆ రెండు పెద్ద జంటల్లో పాపం ఆ బాధ యెవరు పడతారా అని కళ్ళప్పగించి చూస్తోందావిడ.

చూస్తూండగానే ఓ కారు వాళ్ల ముందుకు వచ్చి ఆగింది. ఆ అబ్బాయి రెండు సూటు కేసులు అందులో పెట్టేక, ఆ పిల్ల, ఓ పెద్ద జంట అందులో కూర్చుని, నిలబడ్డవాళ్ళకి చెయ్యూపుతూ వెళ్ళి పోయేరు.

యింతలో నిలబడ్డ వాళ్ల ముందుకి యింకో కారు వచ్చి ఆగింది. అందులో ఆ అబ్బాయి, మరో పెద్ద జంటా మిగిలిన రెండు సూటు కేసులతో సహా యెక్కి వెళ్ళి పోయేరు.

తెల్ల బోయింది సావిత్రమ్మ.

హమ్మ గడుగ్గాయిలూ..యెవరి పుట్టింటికి వాళ్ళు వెళ్ళారన్న మాట. యెంతైనా ఈ కాలం పిల్లలకి తెలివెక్కువే.

నోరెళ్ళ బెట్టి నిలుచుండి పోయిందావిడ..




" శాంతీ ! నువ్వు కాస్త ఆలోచించు . నువ్వు పెళ్లిచేసుకుంటే నీ కాపురం చూడాలనివుంది . నీ మనసులో ఎవరైనా వుంటే చెప్పు . అతనితోనే పెళ్లి జరిపిస్తాను . నువ్వు సుఖంగా వుండటమే నాకు కావాలి . ఒంటరిగా వున్న ఆడదంటే అందరికీ లోకువే . "

ఈ రోజు ఉదయం తన తల్లి చెప్పిన ఈ మాటలు చెవుల్లో మార్మోగుతున్నాయి శాంతికి ఆఫీసుకి వెళ్ళినా . ఈ మాటలు ఆవిడ చెప్పటం ఇదే మొదటిసారి కాదు . ప్రతిరోజూ చెప్తూంటుంది. కొత్త కాకపోయినా ఈ రోజు మాత్రం ఆ మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి . యెప్పుడూ శాంతి సమాధానం చెప్పేది కాదు . ఈ రోజు కొంచెం విసుక్కుంది తల్లిమీద , "యెప్పుడూ యిదే విషయం చెప్తావు . విని విని నాకు విసుగు కలుగుతోంది . " అని . అది తనకి బాధగా వుంది . ఎప్పుడూ అమ్మని మాట అనని తను అంతలా ఎలా అనగలిగింది.

అసలు శాంతి పెళ్లి చేసుకోక పోవటానికి కారణం తను ఇదివరలో ప్రేమలో పడటమే . ఆ గతం ఆమె మనసు పొరల్లోంచి తుడిచి పెట్టుకు పోక పోవటమే. తల్లికి తెలిసినా కూతురు కొత్త జీవితం ప్రారంభించాలని ఆవిడ ఆశ.

దీనికి తోడు ఆఫీసుకి రాగానే వినత నుంచి వచ్చిన ఫోను కూడా తల్లి చెప్పిన విషయం గురించి

ఆలోచించేలా చేసింది. నాలుగేళ్ల క్రితం శాంతి, వినత ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ లో పనిచేసేవాళ్ళు విజయవాడలో .

****

" హలో శాంతీ ఎలావున్నావు ? నేను మాత్రం చాలా ఇబ్బంది పడుతున్నానే మా ఆయనతో , మా చిన్నవాడితో . పెద్దవాడిని ఎల్ కే జి లో వేశాం . పాపం పిచ్చి వెధవ . పొద్దున వెళ్ళి సాయంత్రం వస్తాడే . నేనింటికి వచ్చేసరికి నీరసంగా కూర్చునుంటాడు. ఏం తినకుండా . చిన్నాడు నేలమీద ఆనడే. చచ్చిపోతున్నా వాడితో . మా ఆయనేం పట్టించుకోడు. మా అత్తగారికి మా ఆడపడుచు చదువుకుంటూ వుండటంవల్ల నా దగ్గిర వచ్చి వుండలేరు . మా అమ్మకి రావాలని వున్నా మా నాన్న - 'అల్లుడిదగ్గిర ఎన్నాళ్ళుంటాము ' అంటారు . ఎలాగో అలా మా అమ్మ మూడునెలలుంది. మా నాన్నగారు నాల్రోజులుండి వెళ్లిపోయారు. అప్పుడుమాత్రం చాలా హాయిగా వుందే.

అన్నట్టు, హరిశ్చంద్రుడు ఫోన్ చేశాడే నిన్న. యెలా కనుక్కున్నాడో నా ఫోన్ నెంబర్. అందుకే ఫోన్ చేశా. నీగురించి అడిగాడు. తెలీదని చెప్పా. తెలుసుకోవటం పెద్ద కష్టం కాదన్నాడు . జాగ్రత్త. మళ్ళీ ఏం నాటకం

ఆడతాడో. నువ్విక్కడనుంచి వెళ్లిపోయాకా అతనూ వెళ్లిపోయాడు. నేను పెట్టిన పోలీసు కేసు నుంచి బయట పడ్డాడు. ఇప్పుడు గులాబీ అగ్గిపెట్టెల కంపెనీకి ఏరియా మేనేజర్ట ఆంధ్రాకి. ఆంధ్రా అంతా తిరుగుతుంటాట్ట. పెళ్లయ్యిందట. యిద్దరు పిల్లలుట. "

*****

వినతి ఒక వారం రోజులముందు చేరిందా కంపెనీలో. కృష్ణలంకలో ఒక గదిలో వుండేది . శాంతి చేరేక యిద్దరూ కలిసి సత్యనారాయణపురంలో గది తీసుకుని వుండేవారు . యిద్దరూ వంట చేసుకునేవారు .

శాంతి చేరేటప్పటికే వినతికి హరిశ్చంద్రుడితో పరిచయం బాగా పెరిగిపోయింది . హరిశ్చంద్రుడు ఆ బ్రాంచికి మేనేజరు . నెలలో పదిహేను రోజులు కేంపులు తిరుగుతుంటాడు కంపెనీ పని మీద . కంపెనీకి

చిట్టిలో సభ్యులని చేర్పించటం , డిపోజిట్లు సేకరించటం అతని పని . అతనివల్ల ప్రతి యేడాది ఆ కంపెనికి మంచి లాభాలు చేకూరుతుంటాయి . అందువల్ల అతనిమీద మేనేజిమెంటుకి మంచి అభిమానం . అతనికి కారు , క్వార్టరు యిచ్చారు . జీతభత్యాల సంగతి సరేసరి . అనేకసార్లు విదేశాలకి కూడా పంపేరు ప్రోత్సాహకంగా .

అతను ప్రేమ పిపాసి . ఆడపిల్ల కనిపిస్తే ప్రేమించానంటూ వెంటపడతాడు. అయితే తన విషయాలు బహిరంగం కాకుండా జాగ్రత్త పడుతుంటాడు . విడిగా అందరితో యెంతో మర్యాదగా పెద్ద మనిషిగా ప్రవర్తిస్తుంటాడు. అందువల్ల తన పేరు నలుగురి నోళ్లల్లో నానకుండా జాగ్రత్త పడుతుంటాడు . ఆడపిల్లలు వలలో పడ్డాక మోజు తీరంగానే వదిలేస్తుంటాడు . అలా వినతి కూడా అతని వలలో పడింది . అతన్ని నమ్మింది . అనేకసార్లు అతనితో యేకాంతంగా గడిపింది.

వినతి యెవరితోనో ప్రేమలో పడిందన్న విషయం శాంతి గ్రహించింది . ఒకటి రెండుసార్లు హెచ్చరించింది కూడా . కానీ హరిశ్చంద్రుడుతోనే అనుకోలేదు . ఎందుకంటే హరిశ్చంద్రుడు తననే ప్రేమించాడు అనుకుంటోంది శాంతి . తను చేరిన ఆరు నెలలకి హరిశ్చంద్రుడి వలలో పడింది శాంతి . అతని మాటలు , తన పట్ల చూపే అభిమానం ఆమెని అతని వేపు ఆకర్షితురాలిని చేశాయి .

ఒకరోజు అతను ఆమెని భవానీ ఐ లాండుకు తీసుకువెళ్లాడు . అక్కడ అడిగేడామెని పెళ్లెప్పుడు చేసుకుందామని . ఆమె సిగ్గులమొగ్గయింది . "యెంత త్వరగా వీలైతే అంత తొందరాగా ' అంది .

" అయితే , యిప్పుడే యిక్కడే గాంధర్వ వివాహం చేసుకుందాం అన్నాడు ఆమెని దగ్గిరకు తీసుకోబోతూ .

శాంతి అతని కౌగిలిలో ఒక క్షణం పరవశించిపోయింది . మరుక్షణం స్పృహలోకొచ్చి దూరంగా జరుగుతూ " పెళ్లయ్యేదాకా కొంచెం సంయమనం పాటించాలి " అంది నవ్వుతూ .

"యిద్దరికీ యిష్టమయ్యాక యింకా దూరం దేనికి . ఎలాగూ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం ఈ రోజునించే ఆ అనుభవాన్ని పొందవచ్చు కదా. కావాలంటే గుళ్ళో పెళ్లి చేసేసుకుందాం . నేను నిన్ను చూస్తూ కూచోలేను . ప్లీజ్ ." అంటూ ఆమె దగ్గిరకి రాబోయడతను.

ఆమె దూరం జరుగుతూ “ యిలా చెయ్యటం తప్పు . నాకిష్టం లేదు . “

“అయితే రేపే రిజిష్టర్ మేరేజి చేసుకుందాం . లేదా దుర్గగుడిలో అయితే ముహూర్తాలతో పని లేదుట . “

“ ఊహూ . నాకిష్టం లేదలా. పెద్దవాళ్ళు ముహూర్తాలు నిర్ణయించాలి . నాకు మా అమ్మ ఒక్కతే వుంది. తనతో చెప్పి మీ యింటికి పంపిస్తాను . అన్నట్టు, మరి పెళ్లాయ్యాక తను మనతోనే వుంటుంది మరి . “

“ ఆవిడ మనకి భారమా ఏంటి . రేపే నేనే ఆమెతో మాట్లాడతాను . ఈరోజు మాత్రం యిక్కడే మనం పండగ చేసుకోవాలి . నువ్వు ఒప్పుకుంటావని యిక్కడ అన్ని యేర్పాట్లు చేసేశాను . “

“ నాకలాంటిది యిష్టం లేదు పెళ్ళికి ముందు “ అని ముందుకు కదిలింది . అతను వెంట పడ్డాడు . బ్రతిమిలాడాడు . తను యింతవరకూ ఏ ఆడపిల్ల వెంటా పడలేదన్నాడు . తనంటే ప్రేమవల్ల పిచ్చివాడైపోతున్నానన్నాడు. ఎంతకాలం దూరంగా వుండాలన్నాడు .

ఆమెకి ఒక క్షణం జాలి కలిగింది . పాపం అనిపించింది . పోనీలే ఒక్కసారేగా అనుకుంది . మరుక్షణం ఆమె సంస్కారం ఆమెని మేల్కొల్పింది . ఇప్పుడు ఓపికపడితే జీవితాంతం ఆనందంగా వుండొచ్చు అనుకుంది . అతను తనని పరీక్షిస్తున్నాడేమో అనుకుంది ఏమైనా తను తప్పటడుగు వెయ్యకూడదు .

అతనితో అదే చెప్పింది . “ యిప్పుడు ఓపికపడితే జీవితాంతం మనకి ఆనందం “ చివరికి అతనితో అంది “హరీ , మనం యిక్కడే వుంటే తప్పు చేయొచ్చు. అందుకే ఇక్కడనించి తొందరగా వెళ్లిపోదాం.”రేపే మా అమ్మతో మాట్లాడి మీ యింటికి పంపిస్తాను . ప్లీజ్ .” అని బతిమాలుతూ గబగబా ముందుకు నడిచింది . అలా ఆ ప్రమాదం నుంచి తప్పించుకుంది .

నాలుగో రోజు వినత ఆత్మహత్య చేసుకుంది కృష్ణానదిలో దూకి . అదృ ష్ట వశాత్తూ అక్కడ వున్న చేపలు పట్టే వాళ్ళు ఆమెని కాపాడారు . ఆ సమయంలో శాంతి తన తల్లితో పెళ్లి విషయం

మాట్లాడేందుకు తన వూరు వెళ్లింది.

తను వచ్చేటప్పటికి ఆసుపత్రిలో వుంది. తనని చూడంగానే భోరుమంది. హరిశ్చంద్రుడితో తన ప్రేమ విషయం, తనని ఎలా మోసగించింది వివరంగా చెప్పింది . తనని తిరస్కరించటంతో ఆత్మహత్య చేసుకున్నాని చెప్పింది . శాంతి విస్తుపోయింది . తొందర పడి వుంటే తానూ ఇదే పరిస్థితిలో వుండేదేమో.

శాంతి హరిశ్చంద్రుడితో వినతి గురించి మాట్లాడింది . ఆమెని పెళ్లిచేసుకోమనీ , అన్యాయం చెయ్యొద్దని చెప్పింది . తనకి వినతికి ఏ సంబంధం లేదన్నాడు . తను శాంతిని తప్ప వేరెవరినీ కన్నెత్తి చూడలేదన్నాడు .

శాంతి చివరిగా చెప్పిందతనితో ' నువ్వామెని మోసం చేస్తే భగవంతుడు తగిన శాస్తి చేస్తాడని '

వినతి ఆసుపత్రినించి రాగానే తన కంపెనీ మేనేజిమెంటుకు ఫిర్యాదు చేసింది హరిశ్చంద్రుడిమీద . వారు అతన్ని వుద్యోగం లోంచి తీసేశారు . పోలీసు కేసు పెట్టారు .

ఆ సమయంలో శాంతి తల్లితో విశాఖపట్నం వచ్చింది తన మేనమామగారింటికి . ఇక్కడే వుద్యోగం చేసుకుని వుంటోంది . గతాన్ని మర్చిపోదామన్నా మరుపురావటం లేదు .

వినత కూడా కంపెనీ మానేసి వేరే వుద్యోగంలో చేరింది . తర్వాత పెళ్లి చేసుకుంది . విజయవాడలోనే వుంటోంది .

యిప్పుడు వినతి నుంచి ఫోన్ వచ్చేకా ఆలోచనలో పడింది శాంతి . తానెందుకు శిక్ష అనుభవించాలి పెళ్లిచేసుకోకుండా . అతన్ని తను ప్రేమించింది . కానీ అతను మోసం చెయ్యాలనుకున్నాడు . అతను హాయిగా పెళ్లి చేసుకున్నాడు . అతని వల్ల మోసపోయిన వినతి పెళ్లిచేసుకుని హాయిగా వుంది గతం మర్చిపోయి . తను మాత్రం యెందుకుండాలిలా మోడులా అనుకుంది .

అమ్మ చెప్పినట్టు పెళ్లిచేసుకుని తను కూడా తన ప్రపంచాన్ని నిర్మించుకోవాలనుకుంది . తన నిశ్చయాన్ని

తల్లికి  చెప్పాలనుకుంది .  ఆమె మనసు  కుదుట పడింది .

*****




ఒక స్త్రీ పురుషుడిని ఎందుకు ఎలా ఆకర్షిస్తుందో తెలియదు.

నేను నా స్నేహితుడి పెళ్ళికోసం ఆ ఊరు వెళ్ళి వుండకపోతే రాగిణి నాకు పరిచయం అయివుండకపోయేది.

రాగిణి అందగత్తేం కాదు. ఛామనఛాయకి కొద్దిగా రంగు తక్కువే! కళ్ళూ చలాకీగా, కనుబొమలు తీర్చిదిద్దినట్టు వున్నాయి. నుదుటన దోసగింజంత బొట్టుతో ముఖం ఆకర్షనీయంగా వుంది. చక్కని లైట్ కలర్ శారీ, దానికి తగ్గ మ్యాచింగ్ బ్లౌజ్, మెడలో ఒక గొలుసు, చేతికి రెండంటే రెండు గాజులతో సింపుల్ గా వుంది. ఆమెని చూడాలన్న తపన నాలో పదే పదే ఎందుకు కలుగుతోందో మాత్రం అర్ధం కావడంలేదు. ఆమె వంక అదేపనిగా చూస్తున్న నా చూపుల్ని పసిగట్టిన నా స్నేహితులు 'వీడికేమైందసలు? చుట్టూ అందమైన అమ్మాయిల్ని పెట్టుకుని వీడు ఏవరేజ్ వెనకాల పడుతున్నాడు' అనుకున్నారు. కానీ నా మనసు నా మాట వింటేగా?

దానికీమె తెగనచ్చేసింది..నన్ను ప్రోవోక్ చేస్తోంది.

"ఒరే! నీకేమైనా గాలి సోకిందా? పిచ్చిపట్టిందా? చుట్టూ ఊరిస్తూ ఇన్నన్ని అందాలుంటే..నువ్వేమో అప్పలమ్మ కోసం చూస్తున్నావు. మాకు గొప్ప ఇన్సల్ట్ గా వుంది. ఇంక ఆపరాబాబూ"అన్నాడు నన్ను పక్కకి తీసుకెళ్ళి శీనుగాడు.

"ఏమోరా..నాకూ అర్ధం కావడం లేదు. నామనసెందుకో నా మాట వినడం లేదు. ఆమెని చూస్తుంటే నేను ఇన్నాళ్ళు వెతుకుతున్న దేదో దొరికినట్టుగా..హృదయం పులకించిపోతోంది."అన్నాను.

నా వంక పిచ్చోడ్ని చూసినట్టుగా చూసి ఏమనలేక వెళ్ళిపోయాడు.

ఆమె ఎక్కడికో వెళుతుంటే ఫాలో అయ్యాను. ఆమె స్టోర్ రూంలోకెళ్ళింది. నేనూ లోపలికెళ్ళి..ఆమెని సమీపించి "నిన్ను చూస్తుంటే నాలో ఏదో తెలియని అనుభూతి కలుగుతోంది. ఇంతవరకూ ఏ ఆడపిల్లని చూసినా ఇలా అనిపించలేదు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్, లవ్ ఇత్యాది పదాలు దీనికి వర్తిస్తాయేమో కూడా నాకు తెలియదు. నాకు నువ్వు కావాలి. నిన్ను పెళ్ళిచేసుకోవడమే నా జీవిత ధ్యేయం. అని గట్టిగా ఆమె ముఖాన్ని నా ముఖానికి దగ్గరికంటా తీసుకుని గట్టిగా ఆమె పెదాలపై ముద్దుని ముద్రించాను. ఇది పెళ్ళికి అడ్వాన్స్.."అని నాలుగు మాటలు చెప్పి ఒక చేత చేసి బయటకొచ్చేశాను.

వచ్చేశానన్న మాటేగాని.."కొంపదీసి జరిగింది పెద్ద వాళ్ళకి చెప్పేస్తుందేమో? నా పరువుతీస్తుందేమో? నన్ను పెళ్ళికి పిలిచిన నా స్నేహితుడు ఏమనుకుంటాడో.." అన్న భయం నన్ను తగులుకుంది.

కానీ అటువంటివేమీ జరగలేదు. ఆమె సావధానంగా ఒక పెద్దగిన్నె తీసుకుని పెళ్ళి మండపానికి వచ్చింది. కానీ సమయం దొరికినప్పుడల్లా నన్ను క్రీగంట గమనించడం నేను చూశాను.

నాకు కాస్త ధైర్యం చిక్కింది.

సాయంత్రం నేను అలా తిరిగొద్దామని తోట వైపువెళ్ళాను. పెద్ద పెద్ద పళ్ళ చెట్లతో..గడ్డి, రకరకాల పూల వాసనలతో ఆ ప్రదేశం చాలా ఆహ్లాదంగా వుంది.

‘సిటిలో ఇలాంటివన్నీ కరవు. చక్కటి ప్రకృతి గాలి పీల్చి ఎంతకాలమైందో.’ అనుకుంటూ పెద్ద మామిడి మాను పక్కనుండీ వెళుతుంటే..అదాటున రెండు చేతులు నా చేతుల్ని పట్టుకుని చెట్టుచాటుకి లాక్కెళ్ళాయి. రాగిణి! ఆమె హఠాత్ సాక్షాత్కారం నాకు ఎందుకో గమ్మత్తుగా అనిపించింది.

"చూడండీ! పొద్దున్న స్టోర్ రూమ్లో చిలిపి పని చేసి మీరు చక్కా బయటకి పోయారు కానీ నా మనసు నిమ్మళించడానికి చాలా సమయం పట్టింది. పట్నం నుంచి వచ్చిన మీరు కేవలం ఒక అనుభవం కోసం అలా చేసి వుంటే..నిజం నాకు చెప్పి నన్నూ, ఆ సంఘటననీ మర్చిపోండి. నిజంగా నేను మానసికంగా నచ్చి ముద్దుని బహుమతిగా ఇచ్చుంటే నా జీవితాంతం మీకు ఋణపడివుంటాను."అంది కన్నీళ్ళతో.

"ఛ..ఏమిటది? పొద్దున్న ఇచ్చిన ఆ ముద్దు తప్ప నేను ముందుకు వెళ్ళను..అందువల్ల మోసం ప్రసక్తే లేదు. రేపు నేను పట్నం వెళ్ళాక మా వాళ్ళు వచ్చి మీ వాళ్ళతో సంబంధం మాట్లాడి మన పెళ్ళి ఘనంగా చేస్తారు. అప్పుడు గదిలో..మన శోభనం నాడుమాత్రం నువ్వు ఏ అడ్డూ చెప్ప.."మిగిలిన పదాలు అనకుండా సిగ్గుతో నా పెదాలు తన సున్నితమైన చేతివేళ్ళతో మూసి తుర్రున పరిగెత్తింది.

***

నాకూ తనకీ పెళ్ళయింది. ఎవరేమనుకున్నా నా భార్య నాకు అపూర్వసుందరి. నా స్నేహితులు కూడా ఆ పెళ్ళిలో సరదాగా ఆమె వెంటపడ్డాననుకున్నారు. నేనెప్పుడైతే ఆమెనే పెళ్ళిచేసుకున్నానో..నా సీరియస్నెస్ వాళ్ళకి అర్ధమైంది.

శోభనం.

గదిలో కూర్చుని వున్నాను. తెల్లచీరలో సిగ్గుల మల్లెమొగ్గలా అడుగుపెట్టిందామె. నేను ఆమె చేతినందుకుని మంచంమీద కూర్చోబెట్టాను.

"అప్పుడే చెప్పానుగా శోభనం గదిలో నేనేం చేసినా నువ్వు అడ్డుచెప్పకూడదని.."అని ఆమె మెడ వంపులో ముఖాన్ని అదిమాను.

మొదట్లో చిన్న తంపరగా ప్రారంభమైన ముద్దులు వర్షమై..వాగై..నదై..సముద్రమై ఉప్పొంగాయి. తపనతో నరం నరం తన్మయత్వాన్నందుతోంది. అనుభూతి చెలికట్టదాటి ఇద్దరం మమేకమయి ఆనందపారవస్యంలో అలా మంచం మీద సేద తీరుతున్నప్పుడు..నా సెలెక్షన్ తప్పుకాదని తెలిసింది. నా భార్య రంభ.

***

రేపు మా షష్టిపూర్తి.

పిల్లలూ మనవలూ మనవరాళ్ళూ..అందరూ కలసి ఆనందంగా చేస్తున్న శుభకార్యం.

నా వైవాహిక జీవితం సూపర్ సక్సెస్. చాలా విషయాల్లో ఆమె నేర్పరితనం నాకు విజయాన్ని సాధించిపెట్టింది. పిల్లల పెంపకంలోకాని..అత్తమామలా ఆలనా పాలనలో కాని ఆమె తన బాధ్యతని సక్రమంగా నెరవేర్చింది. మేమిద్దరం ఒకరికోసం ఒకరం పుట్టినట్టుగా అనిపిస్తూంది. అందానికి..డబ్బుకి లొంగిపోయిన నా స్నేహితులు కేవలం సొసైటి కోసం మొగుడూపెళ్ళాలుగా కొనసాగుతున్నారని నాకు తెలుసు. కాని మేము సెక్స్ పరంగా కాని కుటుంబపరంగా కాని ఎప్పుడూ రాజీపడలేదు. నాకిప్పటికీ అర్ధం కానిదేమిటంటే 'నేను నా స్నేహితుడి పెళ్ళికి ఆ ఊరెళ్ళడం యాధృచ్చికమా..లేక అలా జరగాలని రాసిపెట్టి వుండి అలా జరిగిందా' అని ఏదేమైనా మా ఇద్దరికీ సంతృప్తికరమైన జీవితం లభించింది.

శోభనం గదిలో తను సిగ్గులమొగ్గలా అడుగెట్టింది.

నేను "అప్పుడే చెప్పాను..నేను శోభనం గదిలో ఏం చేసి.."తన చేతుల్తో నా పెదవులని మూసేసింది. వృద్ధాప్యంలో కూడా మనసు ఇరవైలా పరుగులుతీయడం అదృష్టం కాక మరేమిటి?




“ఒసే బిచాని ఎక్కడ చచ్చావు. పిలుస్తుంటే పలకవేం” అత్తగారి గొంతు గట్టిగా వినిపించేసరికి ఆలోచనల నుంచి తేరుకుంది బచాని. దాదాపు గంటసేపటినుంచి ఆమె కిటికి దగ్గర నిలబడి బయటకు చూస్తోంది. ఎందుకో కారణం తెలియదు గాని ఉన్నట్టుండి భర్త జటావత్ ఆమెకు గుర్తుకువచ్చాడు. సరిగ్గా ఒక సంవత్సరం ముందు జాటవత్ ఆమెను రెండుసంవత్సరాల పసిబాబును విడిచిపెట్టి అనంతలోకాలకు వెళ్ళిపోయాడు. అతను మాములుగా చనిపోతే బాగుండేది. కాని ఉగ్రవాదుల దాడులో మరణించాడు.

ఆ రోజు జరిగిన సంఘటన బిచాని జీవితాంతం మరచిపోలేదు. ఆ రోజు మాములుగా పాకిస్థాన్ భారత సరిహద్దు ప్రాంతమైన ఫిరోజ్ పూర్ మాములుగా మేలుకుంది. అందరు సంతోషంతో తమ రోజువారి పనిలో పడిపోయారు. బిచాని భర్తకు టి ఫిన్ కట్టి పొలానికి సాగనంపింది. జాటావత్ టిఫిన్ క్యారియర్ తీసుకుని భార్యను ఆప్యాయంగా దగ్గరికి లాక్కున్నాడు. ఆమె చంకలో ఉన్న బాబును గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. తరువాత కన్నతల్లి దగ్గరికి వెళ్ళి వెళ్ళొస్తానని చెప్పి బయలుదేరాడు. బిచాని బాబును ఎత్తుకుని భర్తను గుమ్మం వరకు సాగనంపింది. జాటావత్ ఆమెకు చేతులు ఊపి సైకిల్ మీద పొలానికి వెళ్ళిపోయాడు.

ఎందుకో కారణం తెలియదు కాని అకస్మాతుగా బిచాని కుడి కన్ను అదిరింది. ఆడవాళ్ళకు కుడికన్ను అదిరితే ఆ ఇంటికి ఏదో ఆపదకాని అరిష్టం కాని జరగబోతుందని బిచాని కులంలో ఒక నమ్మకం ఉంది. అది మూఢనమ్మకమో లేక నిజమో ఎవరికి తెలీదు. కాని ఎవరికైన అలాంటి అనుభవం జరిగితే అది భయంవల్లో నమ్మకం వల్లో చాల భయపడతారు. దానికి బిచాని అతీతురాలు

కాదు.

అందుకే మొదటిసారి కుడికన్ను అదరగానే సహజంగానే భయపడింది బిచాని.  ఈ విషయం ముందు అత్తగారితో చెప్పాలని భావించింది. కాని అనవసరంగా ఆవిడను భయపెట్టటం ఎందుకని నోరు మూసుకుంది. ఆ రోజు సాయంత్రం వరకు అన్యమనస్కంగానే ఉంది బచాని. ఏ క్షణంలో ఎలాంటి భయంకరమైన వార్త వినవలసివస్తుందో అని తెగ భయపడిపోయింది.సాయంత్రం అయిదు గంటలవరకు  ఆమె ఊహించినట్టుగా ఏం జరగలేదు. ఆ టైంకు జటావత్ పొలంపనులు పూర్తిచేసుకుని టిఫిన్ క్యారియర్ తీసుకుని సైకిల్ మీద ఇంటికి బయలుదేరాడు.  ఫిరోజ్ పూర్ భారత్ పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో ఉంది. అప్పుడప్పుడు పాకిస్థాన్ సరిహద్దులోంచి ఉగ్రవాదులు రహస్యంగా ఫిరోజ్ పూర్ లో  ప్రవేశించి రక్తపాతం సృష్టించటం చాల రోజులనుంచి జరుగుతోంది. అందుకే భారత ప్రభుత్వం కొంతమంది మిలిట్రి అధికారులను ఆ ప్రాంతంలో నియమించింది. వాళ్ళు రాత్రి పగలు అని తేడాలేకుండ గస్తీ తిరుగుతూ ఉగ్రవాదల జాడ తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

అక్కడ మిలిట్రి క్యాంప్ రావటంతో ఫిరోజ్ పూర్ ప్రజలకు చాల ధైర్యం కలిగింది.  ఒకవేళ అనుకోకుండ ఉగ్రవాదులు దాడిచేసిన మిలిట్రి వాళ్ళు చూసుకుంటారు అని నమ్మకంతో ఉన్నారు. అందుకే ఆ రోజు పొలం పనులు అయిన వెంటనే జటావత్ భార్యకు మల్లెపువ్వులు బాబుకు కొన్ని ఆటసామానులు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. అతనితో పాటు ఆ ప్రాంతంలో నివసిస్తున్న వాళ్ళు కూడా బయలుదేరాడు. అందరు సరదాగా నవ్వుకుంటు పిచ్చాపాటి మాట్లాడుకుంటు సైకిల్ నడుపుతున్నారు.  సరిగ్గా అందరు జటావత్ ఇంటి సమీపంలోకి వచ్చేసరికి ఊహించని భయంకరమైన పరిణామం ఎదురయింది. ఉగ్రవాదులు ఎలా వచ్చారో ఎక్కడనుంచి వచ్చారో తెలియదు. మిలిట్రి వాళ్ళ కళ్ళు ఎలా కప్పారో తెలియదు కాని పదిమంది ఉగ్రవాదులు వాళ్ళకు ఎదురుగా వచ్చారు. అందరి చేతులలో సబ్ మెషిన్ గన్స్ ఉన్నాయి. జటావత్ తో పాటు అతనితో ఉన్నవాళ్ళకు పై ప్రాణాలు పైనే పోయినట్టుగా అయింది. భయంతో అందరు వణికిపోయారు.

ఒక్క  క్షణం పాటు ఆ ఉగ్రవాదులు తీక్షణంగా జటావత్ అతని సహచరులవైపు చూశారు. తరువాత వాళ్ళ నాయకుడు మిగత వాళ్ళ వైపు చూసి కళ్ళతో సైగచేశాడు. అంతే మరుక్షణం ఉగ్రవాదల చేతులలో ఉన్న తుపాకులు భయంకరంగా చప్పుడు చేశాయి.  తప్పించుకోవటానికి కాని అక్కడనుంచి పారిపోవటానికి కాని ఎవరికి అవకాశం దొరకలేదు. మొదటి గుండు జటావత్ శరీరాన్ని చిద్రం చేసింది. గుండు తిన్నగా అతని గుండెలోకి దూసుకుపోయింది. అరవటానికి కాని కనీసం మూల్గటానికి కాని జటావత్ కు అవకాశం దొరకలేదు. ఉన్నవాడు ఉన్నట్టుగా సైకిల్ మీద నుంచి నేలమీద కూలిపోయాడు. ఆ తరువాత  ఏం జరిగిందో అతనికి తెలియదు.  రెండు క్షణాలపాటు మిషన్ గన్ మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లి పోయింది. జటావత్ తో సహ ఇంకో పదిమంది రక్తపు మడుగులో పడిపోయారు. తుపాకిల శబ్దం ఆ నిశబ్దం వాతావరణంలో భయంకరంగా వినిపించింది. చాల మంది తమ ఇంట్లోంచి వచ్చి చూశారు. కొంతమంది భయంతో గట్టిగా అరిచారు. అదే సమయంలో అటువైపు వస్తున్న పోలీస్ వ్యాన్ వెంటనే ఆగింది. అందులోంచి నలుగురు పోలీస్ సిబ్బంది ఒక ఆఫీసర్ దిగారు. అందరు తుపాకులు సరిచేసుకుని ఉగ్రవాదుల వైపు దూసుకువచ్చారు. ఉగ్రవాదులు వెంటనే తమ తుపాకులు పైకి పేల్చి పరిగెత్తారు. పోలిసులు వాళ్ళను పట్టుకోవటానికి ప్రయత్నించారు కాని వాళ్ళు పాకిస్థాన్ సరిహద్దు వైపు పరిగెత్తారు. క్షణంలో కళ్ళకు కనిపించకుండ మాయమయ్యారు.

జరిగింది తెలుసుకున్న బిచాని బాబును ఎత్తుకుని సంఘటన జరిగిన స్థలానికి చేరుకుంది. ఆమె అత్తగారు గట్టిగా ఏడుస్తూ కొడుకును కలవరిస్తూ బిచానిని అనుసరించింది. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూడగానే బిచాని మైండ్ బ్లాంక్ అయిపోయింది. నవనాడులు కృంగిపోయినట్టు అచేతనంగా ఉండిపోయింది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండ ఒక విధమైన ట్రాన్స్ లో ఉండిపోయింది. జటావత్ తల్లి పరిస్థితిచెప్పటానికి వీలులేదు. కొడుకు శవం మీద పడి ఏడ్వసాగింది.

మరునాడు జరగవలసిన తతంగం జరిగిపోయింది. కొంత మంది ప్రభుత్వ అధికారులు వచ్చి బిచానిని ఓదార్చారు. జటావత్ తో చనిపోయిన వాళ్ళందరికి నష్టపరిహారం ఇస్తామని వాగ్దానం చేశారు. లోకల్ యం.యల్. ఏ తన కార్యకర్తలతో వచ్చి నానా హంగామా చేశాడు. ప్రభుత్వం దగ్గర నుంచి పది లక్షలు ఇప్పిస్తానని గట్టిగా అన్నాడు.

భర్త పోయిన షాక్ నుంచి తేరుకోవటానికి బిచానికి పదిరోజులు పట్టింది. ఉన్న భూమిని సాగుచేసుకుంటు రోజులు గడుపుతోంది. ఇటు అధికారులు అటు రాజకీయనాయకులు చెప్పిన డబ్బు మాత్రం ఆమెకు కాని చనిపోయినవారి మిగత కుటుంబాలకు కాని రాలేదు. వాళ్ళను ప్రభుత్వం పూర్తిగా మరచిపోయింది.

అయితే రక్షణ శాఖ ఈ సంఘటనను అంత తేలికగా తీసుకోలేదు. ఉగ్రవాదులను పూర్తిగా అణచాలంటే అందుకే ఒక ప్రత్యేక యూనిట్ కావాలని భావించింది. అందుకే డెల్టా ఫోర్స్ అనే యాంటి ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేసింది. ఆ సంస్థకు నాయకుడు మాలిక్. ప్రతి రోజు కొన్ని గంటలు ఆ సంస్థకు చెందిని కమెండోస్ ఫిరోజ్ పూర్ అడవుల ప్రాంతంలో గస్తీ తిరుగుతున్నారు. కాని వాళ్ళకు మాత్రం ఉగ్రవాదలు ఎదురుపడలేదు. ఇది గతం.

ఇక ప్రస్తుతానికి వస్తే కొడుకు పోయిన తరువాత బిచాని అత్త మనస్సు పూర్తిగా మారిపోయింది. తన కొడుకు చావుకు బిచాని కారకురాలని ఆవిడ భావిస్తోంది. బిచానిని ప్రేమించి పెళ్ళిచేసుకోవటం వల్లే తన కొడుకు అర్థాంతరంగా చనిపోయాడని ఆమె నమ్మకం. అందుకే రోజు బిచానిని అనరాని మాటలతో బాధిస్తోంది. కారణం లేకుండ తిడుతుంది. రాచి రంపాన్న పెడుతోంది. కాని బిచాని మాత్రం పల్లెత్తు మాట అనేదికాదు. దానికి కారణం జటావత్. అతని తల్లిలో ఆమె జటావత్ ను చూసుకుంటుంది. అందుకే ఎదురుచెప్పకుండ అన్ని పనులు నోరు మూసుకుని చేస్తోంది.

అత్తగారి కేక విని తన ఆలోచనలనుంచి బయటపడింది బిచాని. బాబును ఎత్తుకుని హాలులో కి వెళ్ళింది. అక్కడ అత్తగారు పాన్ దాన్ లోంచి పాన్ తీసుకుని నములుతోంది.

“ఏంటి అత్తయ్య పిలిచారు “అంది మెల్లగా బిచాని.

“పిలవలేదు. అరిచాను. ఇంట్లో కట్టెలు నిండుకున్నాయి. వెళ్ళి కట్టెలు తీసుకురా. బాబును కూడా వెంట తీసుకువెళ్ళు. వాడు నా దగ్గర ఒక్క నిమిషం కూడా ఉండలేడు”అందామే. అలాగే అని తలూపి బిచాని లోపలకు వెళ్ళింది. ఒక తాడు తీసుకుంది. బాబును వీపు వెనుక కట్టుకుని ఇంట్లోంచి బయటపడింది. మెల్లగా రోడ్డు మీద నడుస్తూ అడవిలాంటి ప్రదేశం చేరుకుంది. అక్కడే ఆమెకు కావల్సిన కట్టెలు దొరుకుతాయి. ఆ ప్రాంతం అంతా నిర్మానుష్యంగా నిస్తేజంగా ఉంది. ఎక్కడ చిన్న అలికిడి వినిపించటంలేదు. ఆమె కాళ్ళ కింద ఎండుటాకులు చిన్నగా చప్పుడు చేస్తున్నాయి. మెల్లగా కట్టెపుల్లలను ఏరుకుంటు సంచిలో వేసుకుంటుంది బిచాని. అలా కొంచం దూరం నడిచిన తరువాత ఉన్నట్టుండి ఆగిపోయింది బిచాని. చెవులు రిక్కించి వింది. వెనుక నుంచి ఎవరివో ఆడుగుల చప్పుడు వినిపిస్తోంది. వస్తుంది ఒకరు కాదు. ఇంకా చాల మంది వస్తున్నట్టుగా అడుగుల చప్పుడు వినిపిస్తోంది.

ముగింపు వచ్చే సంచికలో.................



మా అత్తగారికి రోజూ ఉదయం 8 గం. ల నుంచి 9 గం.లదాకా పూజ చేసుకోవటం, దేవుడుదగ్గర కూర్చుని ఆవిడకి ఇష్టమయినవేవో చదువుకోవటం అలవాటు. ఆసమయంలో ఆవిడని డిస్టర్బ్ చెయ్యటానికి ఎవరం సాహసించం. ఎందుకంటే ఆ సమయంలో మా ఇల్లు చాలా ప్రశాంతంగా వుంటుంది. ఆ ప్రశాంతత అందరికీ చాలా ఇష్టం. ఎందుకంటే ఆసమయంలో మా పనులు చాలా అయిపోతాయి. అర్ధమయిందనుకుంటాను. అదీ విషయం.

మరి మిగతా సమయాల్లో మా ఇల్లెలా వుంటుందోకూడా చెప్పాలికదా. రణగొణ ధ్వని, రాళ్ళ వాన అంటారే .. అలాగే వుంటుంది. మరి మా అత్తగారి అభిమానం అది. ఇంట్లో ఎవరన్నా ఆవిడకి చాలా ప్రేమ. కొడుకు, మనవడు, మనవరాలు ఎటూ తనవాళ్ళే .. కోడల్ని నేనన్నా కూడా ఆవిడకి చాలా ప్రేమ. ఆవిడ మేలుకున్నంతసేపూ ఇంట్లోవాళ్ళెవరు కనబడితే వాళ్ళమీద కురిపించే ఈ అతి ప్రేమే మా ఇంట్లో అందర్నీ సహనం లేని వాళ్ళుగా తయారు చేసి రణగొణ ధ్వని రాళ్ళవాన సృష్టిస్తుంది.

ఇవాళ ఒక అద్భుతం జరిగింది. మా అత్తగారు మామూలుగా పూజ చేసుకుంటున్నారు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అంటే ఎవరి పనులలో వారున్నారు ఆ అపురూప సమయాన్ని వృధా చెయ్యకుండా. ఇంతలో ఎక్కడినుంచో సంపంగి పువ్వుల వాసన గుప్పుమన్నది. సంపంగి పువ్వులంటే నాకే కాదు, మా అత్తగారికి కూడా ప్రాణం. కాని హైదరాబాదులో అవ్వి దొరకవు. ఆ వాసనకి మనసు ఆనందంతో గంతులు వేసింది. ఎవరన్నా పెట్టుకొచ్చారో, ఏ పూలబ్బాయన్నా అమ్మకానికి తీసుకొచ్చాడేమోనని గబగబా చుట్టు పక్కలా, వాకిట్లోంచి, పెరట్లోంచి రోడ్డు కనబడినంత దూరం డిటెక్టివ్ లా పరిశోధించేశా. ఎక్కడా కనబడలేదు. ఈ లోపల ఎప్పుడో ఆ వాసన కూడా మాయమయింది.

ఇంట్లోకొచ్చి చూస్తే మా అత్తగారు సంబర పడిపోతున్నారు. 'ఏమిటత్తయ్యా, అంత సంతోషంగా వున్నారు?' అడిగాను. మరి నా బాధ్యత కదా.

'అమ్మవారు ఇన్నాళ్టికి నన్ను కరుణించిందే శారదా. ఆవిడ కరుణ అనేక రూపాల్లో ప్రసరింప చేస్తుంది. ఇప్పుడు..ఇప్పుడు, మనకిష్టమయిన సంపంగి పూల సువాసన వ్యాపింప చేసి నన్ను కటాక్షించింది. అంటే మిమ్మల్నందర్నీ కూడా కటాక్షించినట్లేలేవే. ఇన్నాళ్ళకి నా మీద దయగలిగింది అమ్మకి' మధ్యలో నాకు కూడా భరోసానిస్తూ తెగ సంబర పడిపోతున్నారు అత్తయ్య.

ఏదో మేము కొంచెం చదువు వెలగబెట్టాము కదా. దేవుణ్ణి నమ్ముతాముగానీ, దేవుడు డైరెక్టుగా చేసే మహిమలు నమ్మము. అందుకే నేను ఆ సంపంగి వాసన ఎక్కడనుంచి వస్తోందో వెతకాలని ప్రయత్నిస్తూనే వున్నాను. మా అత్తగారు మాత్రం రోజూ అదే సమయంలో వచ్చే ఆ వాసనకు సంబరపడిపోయి, అది అమ్మ మహిమగా, అమ్మవారు తన మీద చూపించే కరుణగా, తను సంబరపడటమేగాక, అందరిచేతా నమ్మించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఇరుగు పొరుగువారు కొందరు మా అత్తగారి మాటలకి ప్రభావితులయ్యో, ఆ సంగతేమిటో చూద్దామనో, ఆవిడ చెప్పినప్పుడు వచ్చి చూడకపోతే మా అత్తగారి సలహాలు,

సహాయాలు వుండవనో, మొత్తానికి ఏ కారణమయినాగానీ, మా అత్తగారి పూజ సమయానికి వచ్చి ఆ వాసనని ఆఘ్రాణిస్తున్నారు.

ఒకసారి పక్క పోర్షన్ లో వున్న అంజలి కూతురు దీప్తి మా అత్తగారితో ' గ్రానీ, మా ఇంట్లో కూడా వస్తోంది ఈ స్మెల్' అన్నది.

దానికి మా అత్తగారు తెగ మురిసిపోయి 'వాసన ఒక్క చోటే వుండదమ్మా. గాలితోబాటు వ్యాపిస్తుంది. అమ్మవారు నిన్ను కూడా చల్లగా చూస్తుందిలే.. నీకు మంచి చదువొస్తుంది, మంచి మొగుడొస్తాడు...'

'స్కూళ్ళూ, కాలేజీలూ మంచివయితే మంచి చదువు ఎటూ వస్తుందిగానీ గ్రానీ, అమ్మవారు చల్లగా చూస్తే నాకు చలెయ్యదా. అసలే నాకు చల్లగాలి పడదు.'

దాని ప్రశ్నకి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ సమాధానం చెబుతున్నారావిడ. ఎందుకో నా ధ్యాస వెనక ఇంటి వైపు వెళ్ళింది. నాలుగు రోజుల క్రితం ఆ ఇంట్లో కొత్తవాళ్ళు అద్దెకొచ్చారు. అంటే...అంతే. రెండు రోజులు నిఘా వేశాను. రోజూ అదే సమయంలో ఆ వాసన రావటానికి కారణం తెలిసింది. ఆ ఇంట్లో దిగినవాళ్ళు వాడే పెర్ఫ్యూమ్ వాసన అది. వాళ్ళు రోజూ ఆ సమయంలో బహుశా ఏ ఆఫీసులకో వెళ్తూ ఆ పెర్ఫ్యూమ్ వాడుతుండుంటారు.

నా డిటెక్షన్ సంగతి ముందు మా ఇంట్లో వాళ్ళకి చెప్పాను. వాళ్ళంతా మూక ఉమ్మడిగా ఆ సంగతి మా అత్తగారికి చెప్పే సాహసం చెయ్యద్దని బతిమాలారు. ఎందుకంటే, అమ్మవారు తనని కరుణించిన సంతోషంలో ఆవిడ మమ్మల్ని కరుణించి, ధ్యాస ఎక్కువగా అమ్మవారిమీదే పెడుతోంది. దానితో మాకు ఆవిడ ప్రశ్నలకు సమాధానాలు చెప్పటం తక్కువ, ప్రశాంతత ఎక్కువ అయింది. ఎంతయినా అందరూ నావాళ్ళేగా. అందర్నీ సంతోష పెట్టాల్సిన బాధ్యత నామీద వున్నది. అందుకే నా పరిశోధన ఫలితాలను చెప్పి మా అత్తగారి దీవెనలు (ఎలాంటివైనా) పొందలేకపోయాను.

అయితే ప్రస్తుతం అమ్మ మహిమవల్ల మా అత్తగారికి మమ్మల్ని పట్టించుకునే సమయం లేక పోవటంవల్ల మేమంతా ప్రశాంతంగా వుంటున్నాము.